

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# కన్నుల పండువగా జ్వాలాతోరణం

## శివయ్యకు అగ్నితో అభిషేకం...భారీ ఎత్తున హాజరైన భక్త జనం



చొక్కాణిచెట్టును కాల్చుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాత్రి భక్తిశ్రద్దలతో కన్నుల పండువగా జ్వాలా తోరణం కార్యక్రమాలను నిర్వహించారు. చొక్కాణి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా, తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొన్ని తమిళ సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తిరుణ్ణావమలైలో పౌర్ణమి సందర్భంగా అగ్నితో అభిషేకించటం ఆనవాయితి. ఈ ఆనవాయితి శ్రీకాళహస్తీశ్వరాలయంలో కూడా తరాల నుంచి నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాటి కార్యక్రమాలకు ఇఓ టి.బాపిరెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షించారు.

**బాలదీపాల ఊరేగింపు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో చొక్కాణి సందర్భంగా ఆలయంలోని అమ్మవారి గర్భగుడి వద్ద గురువారం రాత్రి వెలిగించిన బాల దీపాలను అర్చకులు నాట్యాలు చేస్తూ నంది విగ్రహం వద్దకు తెచ్చారు. సంప్రదాయబబద్ధంగా వేద పండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా అర్చకులు, ఆలయ పౌరోహితుల సారధ్యంలో చొక్కాణి చెట్టును తగులు బెట్టారు. శివయ్యను అగ్నితో పూజించే విధానాల్లో ఇదొకటి, చొక్కాణి ఉత్సవానికి స్థానిక భక్తులు విశేషసంఖ్యలో హాజరయ్యారు. తాటిచెట్టుకు తాటిమట్టలు కట్టి చివరన దీపం ఏర్పాటు చేసి ఓ పరిచారకుడు దీపాన్ని చెట్టుపై ప్రతిష్టించి, తాటి మట్టలను కాల్చారు. ఈ తాటి మట్టల కోసం భక్తులుఎగబడ్డారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి పర్యవేక్షించారు. ఏర్పాట్లను ఎఇఓ లోకేష్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, ఎస్ఓ నాగభూషణం యాదవ్ తదితరులు పర్యవేక్షించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా డివైయస్పి నరసింహామూర్తి సారధ్యంలో చక్కటి బందోబస్తును నిర్వహించారు.



# నీట మునిగిన పంట పొలాలు...

# జలదిగ్బంధంలో గ్రామాలు



జాతీయ రహదారిపై వరద నీరు



వరద ముంపులో వట్రపాలెం



పొంగి ప్రవహిస్తున్న కాళంగి నది



నీట మునిగిన పంట పొలాలు

సూళ్లూరుపేట, డిసెంబర్ 13 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో భారీ వర్షాల ప్రభావంతో కాళంగి నది పొంగి ప్రవహించి ఉగ్రరూపం దాల్చడంతో వరద ముం పుతో విలవిల్లాడుతోంది. శుక్రవారం లోతట్టు ప్రాంతాలైన వట్రపాలెంకు భారీగా వరద నీరు చేరింది. కాళంగి నది, పాముల కాలువ పొంగి ప్రవహించింది. దీనికితోడుగా నెర్రికాలువకు వరద నీరు భారీగా రావడంతో పడమట కండ్రిగ, నాదెండ్లవారికండ్రిగ, పిండిపాలెం తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాలు పంట నీట మునిగింది. గోకులకృష్ణ కాలేజి సమీపంలోని జాతీయ రహదారిపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు కొంతవరకు స్తంభించాయి. పట్టణంలోని అయితా ఆనందకృష్ణయ్య మిల్లు సమీపంలో జిఎన్టి రోడ్డుపైకి వరదనీరు రావడంతో అక్కడ పట్టణంలోకి వచ్చేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. కాళంగి నది ఉగ్రరూపంతో బ్రిటీష్ కాలం నాటి వంతెనపై వెళ్లాలంటే ప్రజలు హడలి పోయారు. మరోవైపు కాళంగి నది ఉధృతితో పరీవాహక ప్రాంతంలోని గోశాల, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఓ విద్యాసంస్థకు చెందిన ప్రాంతం నీట మునిగాయి. శ్రీకాళహస్తికి వెళ్లే రోడ్డు మార్గంలోని పాముల కాలువ, చీపురుగుంట వద్ద ఉధృతిగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ పరిసర ప్రాంతాల్లో వేసిన లేఅవుట్ల వలన వరదనీరు పెద్దస్థాయిలో చుట్టుపక్కల ప్రాంతాలను ముంచెత్తింది. తారకేశ్వర టెక్స్టైల్ పార్కు వద్ద వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో అందులో పనిచేసే కార్మికులు రోడ్డుపైనే నిలిచిపోయారు. మరోవైపు పట్టణానికి వచ్చే మార్గాలన్నీ మధ్యాహ్నం వరకు స్తంభించాయి. కోటపోలూరులోని పుచ్చా కాలువ, మంగానెల్లూరులోని మల్లి కాలువ, మంగళంపాడు వద్ద దొండకాలువ ఉధృతంగా ప్రవహించాయి.

దీంతో ఈ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తూర్పుపల్లెల్లో కొరిడి సమీపంలో ఉన్న ఆర్అండ్బి రోడ్డు కోతకు గురికావడం తో వాటికి ఇసుక బస్తాలు వేసి రాకపోకలను కొంతమేరకు పునరుద్ధరించారు. ఆర్డీఓ కిరణ్మయి ఆధ్వర్యంలో వట్రపాలెం, సాయినగర్ తదితర ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి సహాయక చర్యలు చేపట్టారు. కాళంగి నది కొంతమేర శాంతించడంతో అధికారులు వట్రపాలెం ప్రాంతానికి వెళ్లి సహాయక చర్యలు ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ వర్షంతో పట్టణంలో రోడ్లుతో పాటు గ్రామీణ రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయి.

## కాళంగి గేట్లు ఎత్తడంతో...

# ముంచెత్తిన జలం



పులికాట్ సరస్సును తలపిస్తున్న తడ పంట పొలాలు

తడ, డిసెంబర్ 13 ప్రభాతవార్త : తీరప్రాంతమైన తడ మండలాన్ని గత రెండురోజులుగా వరద నీరు ముంచెత్తింది. ఎగువన బుచ్చినాయుడుకండ్రిగ, కెవిబి పురం మండలాల్లో భారీ వర్షాలు కురవడంతో కాళంగి నది ఆనకట్ట గేట్లు ఎత్తివేశారు. దీంతో వరదనీరు తూర్పువైపు మండలాలను ముంచెత్తింది. ముఖ్యంగా తడ మండలం పరిధిలో కాళంగి, పాముల కాలువ నీరు ప్రవహించాయి. పలు రోడ్లపైకి నీళ్ల ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. మండల పరిధిలోని కాదలూరు రోడ్డుపై మనిషి లోతు నీరు చేరడంతో ఆ ప్రాంతంలో రాకపోకలు స్తంభించాయి. సమీపంలోని తడ, సూళ్లూరుపేట, అపాచి పరిశ్రమలకు వెళ్లే వారు అతి కష్టం మీద చెరువు గట్టును దాటి రహదారిని చేరుకోవాల్సి వచ్చింది. కార్మికులతో పాటు రైతులు ఇబ్బందులు పడ్డారు. కొండూరు సమీపంలోని రైల్వేలైను తూర్పువైపు పొలాలపై కాళంగి నది ప్రవహించింది. దీనితో కొండూరుతో పాటు గ్రద్ద గుంట, చేనిగుంట పొలాలు, నది నీరు కలిసిపోయి పులికాట్ సరస్సును తల పించే విధంగా ఎక్కడ చూసినా జలమయంతో కనిపిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ ప్రాంతానికి వెళ్లే సాహసం కూడా చేయడానికి జంకుతున్నారు. ఇటు వాటంబేడు మార్గంలో ఒక రైస్మిల్లు సమాపాన కాళంగి నీళ్ల ప్రవహించాయి. ఆ రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో పది గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. తడ మండలంలోని వెండ్లూరుపాడు, మాంబట్టు తదితర గ్రామాల్లోను వరద నీరు ప్రవహించడంతో పొలాలు నిండిపోయాయి. గ్రద్దగుంట కాలనీలోకి అరవ నీరు చేరుకోవడంతో అక్కడి ప్రజలు ఇళ్ల నుంచి నీటిని అతి కష్టంమీద బయటకు తోడుతున్నారు. మండల పరిధిలోని వీధులు పూర్తిగా మునిగిపోవడం కాకుండా పలుచోట్ల వేసిన లేఅవుట్లలో ప్లాట్లు కాకుండా నీళ్లే కనిపించడం విశేషం. ఎంత మట్టి తోలినా ఈ వరదకు అది మునిగి స్థిరాస్తి వ్యాపారులకు సైతం నష్టం తీసుకొచ్చింది. శుక్రవారం సాయంత్రానికి వర్షం తగ్గుముఖం పట్టడంతో తీరప్రాంతాల ప్రజలు కాస్త ఊపిరిపీల్చుకున్నారు. శనివారం నుంచి అధికారులు తమ గ్రామాలకు వస్తారని, నష్టాల అంచనాలు వేస్తారని ఎదురు చూస్తున్నారు.

## నీట మునిగి కుళ్లిపోతున్న పంటలు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 13 ప్రభాతవార్త: నవంబరు నుంచి రాష్ట్రంలో వరుస తుఫానులు ప్రభావం వల్ల జల ప్రళమయను తలపిస్తున్నాయి. నవంబరు నెలలో తెలుగు గంగ నీళ్ల రావడంతో అన్నదాతలు వ్యవసాయ సాగుకు సిద్ధమై వరినాట్లు, మిరప పంటలను సాగు చేయడం ప్రారంభించారు. అయితే సాగు చేసిన కొద్ది రోజుల నుంచి వరుస తుఫాను ప్రభావం వలన వాగులు, వంకలు, నదులులో నీటి ప్రవాహం పెరిగి జల ప్రళయంగా మారి మునిగి, గండ్లు పడి పంట నష్టం జరిగింది. తుఫాను ప్రభావంతో డిసెంబరు నెలలో ఎడ తెరిపి లేని వర్షం కురవడం వలన పంటలు నీట మునిగి కుళ్లిపోయే దశకు చేరుకున్నాయి. దీంతో దిక్కు తోచక అన్నదాత అల్లాడుతున్నారు. సాగు చేసేటప్పుడు నష్టం, పంట దిగుబడి జరిగేటప్పుడు పంట నష్టం జరుగుతుంది. దీంతో పంట చేతికి రాక పెట్టు బడులు అధికమై అప్పుల బారిన పడి రైతన్నలు ఆత్మహత్యలు శరణమం టున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణమాఫిలు సబ్సిడీలు పేరుతో తూతూ మంత్రంగా రైతన్నలను మభ్య పెట్టుతున్నారే తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.



నీట మునిగిన పంట పొలాలు

# పంటపొలాల్లో తగ్గని వరదనీటి ప్రవాహం

## -జగనన్న కాలనీని చుట్టుముట్టిన వరదనీరు -చిట్టత్తూరు చెరువుకు గండికొట్టిన వైనం



చిట్టత్తూరు పెద్దచెరువుకు గండికొట్టిన దృశ్యం



వర్షపునీటిని మళ్ళింపును పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐలు

తొట్టంబేడు, డిసెంబర్ 13 ప్రభాతవార్త : మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం వరకు 107.5మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో మండలంలోని వరిపంటపొలాలు చెరువుల్లా దర్శనం ఇస్తున్నాయి. మండలంలోని పలుకాలనీలు జలపాతాల్లా దర్శమిస్తున్నాయి. మండలంలో ఎక్కడ చూసినా పంటపొలాల్లో నీరు చేరి ఇవి పంటపొలాలా... లేక చెరువులా అన్నట్లు దర్శనమిస్తున్నాయి. మండలంలోని కొండకోనలు, రాజీవ్నగర్ నుంచి వచ్చే నీరంతా మండలంలోని చిట్టత్తూరు పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామాన్ని చుట్టు ముట్టడంతో ఇక్కడ నీటి ప్రవాహం చెరువుల్లా మారింది. దీంతో సమాచారం అందుకున్న సిఐ తిమ్మయ్య, ఎస్ఐ ఈశ్వరయ్యలు ఇక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించి జెసిబితో నీటి ప్రవాహాన్ని మళ్ళించే చర్యలు చేపట్టారు. పంటపొలాల్లో వరినాట్లు నీటిలో మునిగిపోగా మరియు కొన్ని పంటపొలాలు చెరువుల్లా మారాయి. ఇక చిట్టత్తూరు పెద్దచెరువులో నీరు ఎక్కువవడంతో స్పందించిన సర్పంచ్ కృష్ణమూర్తి అధికారుల సూచనలతో జెసిబితో గండికొట్టించడంతో గ్రామస్తులు హమ్మయ్య అని ఊపిరిపీల్చుకున్నారు. ఇక బోనుపల్లికి వెళ్ళే మార్గంలో కాళంగి వాగు ఉధృతి పెరగడంతో ఈమార్గంలో రాకపోకలు ఆగిపోయాయి. ఇక కారాకొల్లు గ్రామానికి వెళ్ళేరోడ్డు వద్ద దొంగల ముదూరు వాగు ప్రవహిస్తుండడంతో ఈమార్గంలో కూడా రాకపోకలు ఆగిపోయాయి. ఇక పొయ్య పంచాయతీ కొమ్మనగుంట దళితవాడలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక పిల్లమేడు దళితవాడ, పెద్దకనపర్తి దళితవాడ, చిట్టత్తూరు దళితవాడల్లోనే కాకుండా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరినాట్లులో నీటి ప్రవాహం తగ్గడంతో పంటనష్టాన్ని అంచనా వేస్తామని వ్యవసాయాధికారులు తెలిపారు. ఎంపిడిఓ సురేంద్రనాథ్, ఇన్ఛార్జి ఇఓపిఆర్డి అంకయ్యలు పరిస్థితులను ఎక్కడికక్కడ పరిశీలించారు. కొత్తకండ్రిగ గ్రామంలో సిఐ తిమ్మయ్య, ఎస్ఐ ఈశ్వరయ్య, ఎంపిడిఓ సురేంద్రనాథ్, ఇన్ఛార్జి ఇఓపిఆర్డి అంకయ్యలతో పాటు గ్రామంలో చేరిన నీటిని జెసిబితో మళ్ళించారు. నీటి ప్రవాహం తగ్గితే పంటనష్టం అంచనా వేయచ్చని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. తెలుగుగంగ కాలువలో నీటి ప్రవాహాన్ని పూర్తిస్థాయిలో తగ్గించాలని పలువురు అన్నదాతలు కోరుతున్నారు. తొట్టంబేడు మండలంలో మొత్తం 38 చెరువులు గంగ కాలువ నీటితో నిండుతాయి. ఇవి కాకుండా తెలుగుగంగ నీటితో లిఫ్ట్ఇరిగేషన్ ద్వారా పెద్దకన్నలి, చియ్యవరం, రాంబట్లపల్లి, మామిడిగుంట, చేమూరు చిన్నచెరువు, మల్లిగుంట చెరువులకు నీరందుతోంది. శ్రీకాళహస్తి నుంచి పిచ్చాటూరు మార్గంలో వాగులు వంకలు ప్రవహించి నీరు చేరడంతో రాకపోకలు ఆగిపోయాయి.

# కుంగిన కాజ్వే రాకపోకలకు అంతరాయం



వడమాలపేట వద్ద కుంగిన కాజ్వే

వడమాలపేట, డిసెంబరు 13 ప్రభాతవార్త: వడమాలపేట సమీపంలో తిరుపతి- చెన్నైజాతీయ రహదారిలో చీమలవారి వంకకు నిర్మించిన కాజ్వే వర్షాలకు కుంగిపోయింది. రెండు రోజులుగా వర్షపునీరు ఉధృతంగా ప్రవహిం చడంతో పోలీసులు రాకపోకలను బైపాస్ రోడ్డుకు మళ్లించారు. కాజ్వే కుంగిన విషయం శుక్రవారం గుర్తించారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు ఆర్అండ్బీ డీఈ అమర్నాథ్రెడ్డి కుంగిన కాజ్వేను పరిశీలించారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. బైపాస్ రోడ్డు మీదుగా వాహనాలను మళ్లించారు. వడమాలపేటకు ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు రాకపోకలు మూడు రోజులుగా నిలిచిపోయింది. దీంతో వడమాలపేట పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతుకు గురైన కాజ్వేపై దృష్టి సారించి వడమాలపేటకు వాహనాల రాకపోకలు కొనసాగించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతు న్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వరి, వేరుశనగ పంటలు నీట మునిగాయి. టీసీ అగ్రహారం గ్రామంలో వరిపంటపై వరద నీరు ప్రవహిం చడంతో పంట పొలాలు కోసుకుపోయి మెట వేశాయి. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



## మళ్లీ కొట్టుకుపోయిన పూడి కాజ్వే

### -మరమ్మతుల పేరుతో లక్షల రూపాయలు లూటీ



కేవీబీ పురం, డిసెంబరు 13 ప్రభాతవార్త: మండలంలోని రాజుల కండ్రిగ, దిగువపూడి, పోలినాయుడు కండ్రిగ తదితర గ్రామాలకు ప్రధాన మార్గం అయిన పూడి కాజ్వే వరదలకు మళ్లీ కొట్టుకుపోయింది. వరదలు వచ్చిన ప్రతీసారి ఆరు గ్రామాలకు ప్రధాన మార్గం అయిన ఈ మార్గం కొట్టుకుపోతుండడంతో ఆరు గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సైతం గ్రామం దాటలేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఇదిలా ఉంటే తమ కష్టాలను గుర్తించాల్సిన పాలకులు కాజ్వే కొట్టుకుపోయేంత వరకు చోద్యం చూస్తూ కొట్టుకుపోయిన తరువాత రాజకీయాలు చేయడం దారుణమని ఆరు గ్రామాల ప్రజలు మండి పడుతున్నారు.

**నాయకుల పాలిట కల్ప వృక్షంలా పూడి కాజ్వే:**

ప్రతి ఏటా వచ్చే వరదలకు పూడి కాజ్వే కొట్టుకుపోవడం అలవాటుగా మారింది. కాజ్వే కొట్టుకుపోయిన ప్రతీసారి అధికారులు, నాయకులు నానా హడావిడి సృష్టించి మరమ్మతుల పేరుతో ప్రతి ఏటా సుమారు లక్షల రూపాయలు లూటీ చేస్తున్నారని, ఈ మార్గం నాయకుల పాలిట కల్పవృక్షంలా మారిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ముప్పై ఏళ్లుగా ఈ కాజ్వే మరమ్మతుల కోసం సుమారు రూ.10 కోట్ల వరకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

# రైతును వంచించిన...కూటమి ప్రభుత్వం

## - కలెక్టరేట్ ఎదుట చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్ఛార్జీ విజయానందరెడ్డి



నిరసన దీక్షలో మాట్లాడుతున్న వైకాపా చిత్తూరు ఇన్ఛార్జీ

చిత్తూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త: ఎన్నికల ముందు అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం ప్రజలు, రైతులకు ఇచ్చిన ఒక్క హామీని ఇప్పటి వరకు అమలు చేయాలని చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త ఎంసి విజయానందరెడ్డి ధ్వసమెత్తారు. ఎంసి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరునెలలు కావస్తున్న ఎన్నికల్లో రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకవడంపై వైకాపా నాయకులు, కార్యకర్తలు రోడ్డెక్కారు. చిత్తూరు గిరింపేట దుర్గమ్మగుడి నుండి కలెక్టరేట్ వరకు వైకాపా నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కుప్పం నియోజకవర్గ వైకాపా ఇన్ఛార్జ్, ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎంపీ రెడ్డప్ప, పలమనేరు వైకాపా నియోజక వర్గ ఇన్ఛార్జీ వెంకటేగౌడ, పూతలపట్టు నియోజకవర్గ వైకాపా ఇన్ఛార్జీ డాక్టర్ సునీల్, జిడినెల్లూరు నియోజకవర్గ వైకాపా ఇన్ఛార్జీ కృపాలక్ష్మీ, వైకాపా చిత్తూరు నియోజకవర్గ ఇన్ఛార్జీ ఎంసి విజయానందరెడ్డిలు మాట్లాడుతూ తాము ఎన్నికల్లో విజయం సాధిస్తే రైతులకు కేంద్ర ప్రభుత్వం రైతుకు భరోసా కల్పించడానికి అందించే సహాయంతో పాటు ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం పంట సాగు కోసం ఏడాదికి రూ.20 వేలు మంజూరు చేస్తుందని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేసిన ఎంఎస్పి, రైతు పంట బీమాను కూటమి సర్కార్ ఎత్తివేసిందన్నారు. తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, పంట ధరల స్థిరీకరణకు చర్యలు చేపట్టాలని, రైతుల వద్ద తడసిన, రంగుమారిన ధాన్యంను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన అనంతరం వైకాపా నాయకులు జిల్లా ఇన్ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలలో పాల్గొన్నారు.

## ఆరు నెలల్లో ఎంతో చేశాం- తెలుగుదేశం బైక్ ర్యాలీ

చిత్తూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త: గత ఐదేళ్ళ వైకాపా ప్రభుత్వంలో చేయలేని పనులను ఈ ఆరు నెలల తెలుగుదేశం ప్రభుత్వం చేసి చూపిందని, ప్రజలు తెలుగుదేశం పార్టీ వైపు వున్నారని మాజీ ఎమ్మెల్సీ బిఎన్. రాజసింహులు పేర్కొన్నారు. గత ఐదేళ్ళ వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు, ప్రస్తుత ఆరు నెలల్లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను గుర్తు చేస్తూ మాజీ ఎమ్మెల్సీ బిఎన్. రాజసింహులు ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు కాజూరు బాలాజీ, గుడిపాల మాజీ జడ్పీటిసీ బాలాజీ నాయుడు, ఇతర తెలుగు దేశం నాయకులతో శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గత ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంను రోడ్డు పట్టాలు ఎక్కించిందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుకు అండగా నిలుస్తోందన్నారు. ఈ ర్యాలీకి తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# గోకులం షెడ్లను అర్హులకు అందేలా చూడాలి!

## - ఎస్సీ, ఎస్టీలకు గోకులం షెడ్లు మంజూరు చేయని అధికారులు!

పాలసముద్రం, డిసెంబర్ 13 ప్రభాతవార్త: తాము అధికారంలోకి వస్తే నిరుపేదల జీవితాలను మార్చివేస్తాం అని ఎన్నికల్లో పెద్ద హామీలు వచ్చిన తెలుగుదేశం పార్టీ అధికారం కైవసం చేసుకున్న అనంతరం ఎస్సీ, ఎస్టీల నోట్లో మన్ను కొడుతోంది. ఎదైనా ప్రభుత్వ పథకాలు మంజూరు అయితే వాటిని మండలంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులని చెప్పుకొనే ఒకరిద్దరు తమ వారికే పథకాలు మంజూరు చేసి మిగిలిన వారిని విస్మరిస్తున్నారు. ప్రస్తుతం మండలానికి పాడి, గొర్రెలు, మేకలు కల్గిన రైతులకు వాటిని వాన నుండి సంరక్షించడానికి గోకులం షెడ్లు మంజూరు అయ్యాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేస్తున్న ఈ పథకం కింద లబ్ధిదారుడికి 2.30 లక్షల రూపాయల మేరకు లబ్ధి కలుగుతుంది. లబ్ధిదారుడి వాటా పోగా ప్రభుత్వం నుండి పక్కాగా 2లక్షల రూపాయల నిధులు మంజూరు అవుతాయి. గోకులం షెడ్ల ద్వారా ఒకొక్క లబ్ధిదారుడికి రూ.2 లక్షల వరకు ఆదాయం లభించనుండటంతో ఈ షెడ్లను మంజూరు చేసుకోవడానికి అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున రాజకీయం చేశారు. నిజంగా ఆవులు, మేకలు, గొర్రెలు వుండి షెడ్లు వేసుకోవడానికి ఆర్థిక స్తోమత లేక ఎండలో చెట్లకు వాటిని కట్టి మేపుతున్న రైతులను ఈ పథకంలో లబ్ధిదారులుగా చేయకుండా అప్పటికే ఆర్థికంగా బలంగా వుండి షెడ్లు నిర్మించుకున్న వారికి గోకులం షెడ్లను మంజూరు చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. మండల పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బిసీలు అధిక మంది రైతులకు ఆవులు, గొర్రెలు, మేరకు పెద్ద మొత్తంలో వుండి గోకులం షెడ్లు అవసరం వున్నప్పటికీ అధికారులు వారికి షెడ్లు మంజూరు చేయని పరిస్థితి ఏర్పడింది. మండలంలోని వనదుర్గాపురం దళితవాడలో గత 50 సంవత్సరాలుగా ఐదు ఎస్టీ కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరికి మేకలు పెంచి పోషించడమే వృత్తి. నిత్యం మేకలు వుండటంతో వీరికి గోకులం షెడ్లు అవసరం వున్నప్పటికీ మంజూరు చేసే నాథుడు లేకపోవడంతో వున్న మేకలు వర్షం వస్తే తడవడం తప్పనిసరి అవుతుంది. వనదుర్గాపురం ఎస్టీ కాలనీకి చెందిన గంగయ్య అనే వ్యక్తికి పది మేకల వరకు వున్నాయి. ఈ మేకలకు సరైన షెడ్డు సౌకర్యం లేకపోవడంతో అడవుల్లో పగటి పూట మేయడం, రాత్రుల్లో చెట్ల కింద పడుకోవడం చేస్తున్నాయి. ఇలాంటి వారికి ఒక్కటైనా అధికారులు గోకులం షెడ్ మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని అందరు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఆవులు, మేకలు, గొర్రెల రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న గోకులం షెడ్లను అర్హులకు అందేలా అధికారులు పక్కాగా చర్యలు తీసుకోవాలని మండలంలోని ప్రతి ఒక్కరు కోరుతున్నారు.

# జనవరి నుంచి అభివృద్ధి పనులు వేగవంతం !

## - ప్రజారోగ్యం.. పారిశుద్ధ్యానికి పెద్దపీట : కమీషనర్



సమావేశంలో ప్రసంగిస్తున్న మున్సిపల్ కమీషనర్

కుప్పం, డిసెంబర్ 13 ప్రభాతవార్త : కుప్పం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ల సూచనల మేరకు కుప్పం మున్సిపాలిటీలో ప్రజల ఆరోగ్యంతో పాటు పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఇళ్లు, దుకాణాల నుంచి నేరుగా చెత్తను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంగా ఇదివరకే తొంభైశాత ం మందికి అవగాహన వచ్చిందన్నారు. ఇంకా మరికొందరు రోడ్లపై చెత్తను వేయడం చేస్తున్నారని వారు కూడా తమకు సహకరించాలన్నారు. పట్టణంలో రోజుకు రెండుపూటల పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు పేర్కొ న్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో బ్లీచింగ్ చల్లడం జరుగుతోందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో జనవరి నుంచి అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయన్నారు. పనులకు సంబంధించి టెండర్లను జనవరిలో ఆహ్వానిస్తామన్నారు. భూగర్భ డ్రైనేజీ, పట్టణ సుందరీకరణ, పార్కుల అభివృద్ధి తదితర పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో అవెన్యూ ప్లాంటేషన్తో పాటు డివైడర్లపై మొక్కలు నాటుతున్నట్లు పేర్కొన్నారు. అయితే పట్టణంలో పలువురు పశువులను యధేచ్ఛగా రోడ్లపై వదిలేస్తుండడంతో మొక్కలు నాశనం అవుతున్నాయన్నారు. పశువుల యజమానులు మున్సి పాలిటీకి సహకరించాలని లేకు ంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వచ్చిన దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కుప్పం మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలు కూడా సకాలంలో పన్నులు చెల్లించి తమవంతు అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్దాము, కౌన్సిలర్లు సోమశేఖర్,సురేష్, ఎంఆర్ సురేష్, జాకీర్, సోమశేఖర్ పాల్గొన్నారు.

## నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు

**చిత్తూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** జిల్లాలో సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా శనివారం కృష్ణాపురం ప్రాజెక్టు కమిటీకి సైతం శనివారం ఎన్నికలు జరుగనుంది. జిల్లాలోని 31 మండలాల పరిధిలో 215 చిన్ననీటి వినియోగదారుల సంఘాలు, కృష్ణాపురం ప్రాజెక్టు పరిధిలోని ఐదు నీటి వినియోగదారుల సంఘాలకు పోలింగ్ జరుగనుంది. ఈ ఎన్నికలను సజావుగా 2,521 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపినవారికి జరిమానా

**చిత్తూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పరిధిలో మద్యం సేవించి ద్విచక్రవాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 20 మంది వాహనదారులకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉమాదేవి ఒక్కొక్కరికి 10వేల రూపాయల జరిమానా విధించారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు వెల్లడించిన వివరాల మేరకు చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు గురువారం చిత్తూరు నగర పరిధిలో వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం సేవించి ద్విచక్రవాహనాలు నడుపుతూ 20 మంది వాహనదారులు పట్టుబడ్డారు. ఈ మేరకు వీరిని శుక్రవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట హాజరు పరిస్తే జడ్జి ఉమాదేవి ఒకొక్క వాహనదారుడికి 10 వేల రూపాయలు జరిమానా విధించారు.

## భూసమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**పూతలపట్టు, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** మండల పరిధిలో శుక్రవారం కమగుట్టపల్లి గ్రామసచివాలయ పరిధిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరైన తహసిల్దారు గుర్రప్ప మాట్లాడుతూ రైతులకు ఆన్‌లైన్‌లో భూములకు సంబంధించి ఎదైనా సమస్యలు వున్నా, రీ-సర్వే జరిగిన గ్రామాల్లో ఎదేని భూసమస్యలు వున్నా రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి ఎంపిటిసీ విజయలక్ష్మీ, పాలకూర గ్రామ సర్పంచ్ పంకజాక్షి, కమ్మికొట్టుపల్లి సర్పంచ్ సురేఖ, విఆర్‌ఓలు, విఆర్‌ఎలు తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ మోడల్ ప్రశాపత్రాలను ఆవిష్కరించిన ఇన్‌ఛార్జీ కలెక్టర్

**చిత్తూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** టెన్త్ విద్యార్థుల కోసం యుటిఎఫ్ రూపొందించిన టెన్త్ మోడల్ ప్రశ్నాపత్రాలను శనివారం ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి ఆవిష్కరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్‌లు, సహాధ్యక్షులు రెడ్డప్పనాయుడు, నాయకులు రెహానాబేగం, ఎస్‌పి బాషా, ఏకాంబరం, సరిత, ఎం.పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

## పత్రికా స్వేచ్ఛను హరించడం అన్యాయం

**చిత్తూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** పత్రికా స్వేచ్ఛను హరించడం అన్యాయ మని జిల్లా ఎపియూడబ్ల్యుజె అధ్యక్షులు లోకనాథన్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఎపియూడబ్ల్యుజె, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్ కడప జిల్లా వేముల వద్ద సాగునీటి సంఘాల ఎన్నికలను కవర్ చేయడానికి వెళ్ళిన విలేకరులపై అక్కడి అధికార పార్టీ నాయకరులు దాడి చేసి గాయపరచడం అన్యాయమన్నారు. నిరసన అనంతరం విలేకరులు ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుయుజె, చిత్తూరు ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## దేవరకొండపై కార్తీక దీపం

బంగారుపాళ్యం, డిసెంబర్ 13 ప్రభాతవార్త: స్వయంభూ శ్రీమొగిలీశ్వరాల యంకు అనుబంధంగా వున్న దేవరకొండపై శుక్రవారం కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. దేవరకొండపై వెలసిన పార్వతి సమేత జలకంఠేశ్వర స్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మొగిలీశ్వరాలయం నుండి అటవీ ప్రాంతంలో అటవీ ప్రాంతంలో వెలసిన జలకంఠేశ్వరస్వామి దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. సాయంత్రం దేవరకొండపై కార్తీక దీపోత్సవంను ఆలయ అర్చకులు వెలిగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా మొగిలీశ్వరాలయ వంశ పారంపర్య ధర్మకర్త ఎంబి విజయకుమార్, ఇఓ విజయకుమార్ తగు ఏర్పాట్లు చేశారు. అలాగే కార్తీక నక్షత్రం సందర్భంగా మొగిలీశ్వరాలయంలో మూలవిరాట్ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు అర్చకులు చేపట్టారు. అధిక సంఖ్యలో స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.

## ఒకటిన్నర టన్నుల రేషన్‌బియ్యం స్వాధీనం

**కుప్పం, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా పేదలకు అందించే రేషన్ బియ్యంను కర్ణాటకలోని తమిళనాడుకు అక్రమంగా సుమోలో తరలిస్తుండగా కుప్పం పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. కర్ణాటకలోని కెజిఎఫ్‌కు చెందిన నాసిర్ అనే వ్యక్తి గురువారం రాత్రి టాటా సుమో వాహనంలో ఒకటిన్నర టన్నుల రేషన్‌బియ్యంను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని వాహనంతో సహా బియ్యాన్ని సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

## పట్టపగలే వృక్షాలు నరికివేత

**వి.కోట, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** రోడ్ల పక్కన ఉన్న వేలాది రూపాయల విలువచేసే తైలం చెట్లను కొంతమంది పట్టపగలే యధేచ్ఛగా నరికేస్తున్నారు. చెట్లను సంరక్షించాల్సిన అటవీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదివరకే బైరపల్లి క్రాస్‌లో ఉన్న తైలం చెట్లు మాయమయ్యాయి. చెరువులు, ప్రభుత్వ భూముల్లో ఉన్న చెట్లను నిమిషాల వ్యవధిలో యంత్రాల ద్వారా కూల్చి వేస్తున్నా అటవీ అధికారుల నిర్లక్ష్యంతో పచ్చటిచెట్లు కనుమరుగవుతున్నాయి. అటవీ ఉన్నతాధికారులు స్పందించి మండలంలో కలప అక్రమ రవాణాపై దృష్టి సారించాల్సి ఉంది.

## రామకుప్పంలో అవీ.. ఇవీ

**రామకుప్పం, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** స్థానిక వెలుగు కార్యాలయంలో విఒ లీడర్ల సమావేశంజరిగింది. ఎపిఎం శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ మహిళలు పొదుపు సంఘాల ద్వారా రుణాలు తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. చిన్న పరిశ్రమలు, దుకాణాలు ఏర్పాటుచేసుకోవాలని మహిళలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక మండల కార్యాలయంలో ఐసిడిఎస్ అధికారులచే కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై రెడ్డి శేఖర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, సైబర్ నేరాలు తదితరాలపై అవగాహన కల్పించారు. బాలికల ఆరోగ్యం, పౌష్టికాహారం తదితరాలపై ఐసిడిఎస్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో సిడిపిఒ కల్పన, ఎంఇఒ 2 నారాయణ, అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## అమరవీరులకు నివాళులర్పించిన ఎంపి దగ్గుమళ్ల



చిత్తూరురూరల్, డిసెంబరు 13 ప్రభాతవార్త: 2001 డిసెంబరు 13న ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రతీకగా నిలిచిన పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రవాది దాడిలో తమ ప్రాణాలను అర్పించిన భద్రతా సిబ్బందికి ఢిల్లీ పార్లమెంటు ప్రాంగణంలో చిత్తూరు పార్లమెంటుసభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు వారి త్యాగాన్ని స్మరించుకొంటూ నివాళులు అర్పించారు.

## చిత్తూరులో చెస్ క్రీడాకారుల సంబరాలు

**చిత్తూరురూరల్, డిసెంబరు 13 ప్రభాతవార్త:** చిత్తూరు పట్టణం, డిఎస్ఏ క్రీడా మైదానంలో అతి చిన్న వయస్సులో గుకేష్ ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్ టైటిల్ గెలుచుకోవడంతో టపాకాయలు పేల్చుతూ సంబరాలు జరుపుకొన్నారు. విశ్వనాధన్ ఆనంద్ గతంలో భారత్ తరుపున ఐదుసార్లు ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్‌ను గెలుచుకోగా గుకేష్ 17 ఏళ్ల వయస్సులో ఫిడే క్యాండిడేట్స్ చెస్ ఛాంపియన్ షిప్ సాధించి రెండో భారతీయుడుగా నిలిచాడు. ఈ సంబరాల్లో డిఎస్‌డిఓ బాలాజీ, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి శరత్, కోచ్‌లు, పిడిలు, పిఇటిలు తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో బస్‌షెల్టర్!



**చౌడేపల్లి, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన చౌడేపల్లి బస్టాండులో బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా వుంది. దీంతో ప్రయాణీకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పుంగనూరు, బోయకొండకువెళ్ళేప్రయాణీకులుఅధిక సంఖ్యలో బస్‌షెల్టర్‌ను ఆశ్రయిస్తున్నారు. అయితే షెల్టర్ పైకప్పు పెచ్చులూడి కిందకు పడుతోంది. ఇటీవల పెచ్చులు తలపై పడి ప్రయాణీకులు క్షతగాత్రులయ్యారు. అధికారులు స్పందించి శిథిలావస్థలో వున్న బస్‌షెల్టర్‌ను మరమ్మతు చేయించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుటే కత్తితో దాడి



**సోమల, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** కుటుంబ కలహాలతో భావ బావమరిది పై కత్తితో దాడి చేసిన సంఘటన సోమల పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సోమల దళితవాడకు చెందిన మునస్వామి నంజంపేట దళితవాడకు చెందిన రామకృష్ణ అక్కను పెళ్లి చేసుకున్నాడు. అలాగే మునుస్వామి కుమారుడు సుభాకర్ రామకృష్ణ కుమార్తె హిమబిందుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఆరు నెలలుగా మనస్పర్ధలు ఏర్పడి విడివిడిగా ఉన్నారు. పిల్లలను విడదీయడంలో రామకృష్ణ పాత్ర ఎక్కువగా ఉందని మునుస్వామి పెద్దమనుషుల సమక్షంలో ఆరోపిస్తూనే ఉన్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పోలీస్ స్టేషన్లో పంచాయతీ జరుగుతుండగా కోపోద్రిక్తుడైన మునస్వామి ముచ్చు కత్తితో రామకృష్ణ మెడ పై నరికాడు. ఈ సంఘటనపై అటు పోలీసులు, ఇటు బస్టాండ్ లో ఉన్న ప్రయాణికులు నివ్వర పోయారు. తేరుకున్న పోలీసులు మునస్వామిని అదుపులో తీసుకొని రామకృష్ణను 108 ద్వారా పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## కిశోర వికాస శిక్షణతోనే బంగారు భవిష్యత్తు



**కల్లూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** కిశోర వికాస శిక్షణతోనే బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది పడుతుందని పులిచెర్ల మండల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వై జర్లు విజయలక్ష్మి, రమాదేవి అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కిషోర్ వికాస శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో వైద్యాధికారిణి జానకిరావు మాట్లాడుతూ కిషోర్ బాలికలు యుక్త వయసులో వ్యక్తిగత పరిశుభ్రత సంపూర్ణ ఆరోగ్యం ముఖ్యమన్నారు ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య మాట్లాడుతూ బాలికలకు స్వీయ రక్షణ ఆర్థిక రక్షణ విద్యతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఎంపీడీవో రాజశేఖర్ బాబు మాట్లాడుతూ బాలికల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అందరూ ముందుండాలి అన్నారు. మహిళా పోలీస్ భారతి మాట్లాడుతూ బాలికలు సైబర్ నేరాలు, ఫోక్సో చట్టం తదితర విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూఎస్ ఏ ఈ గౌతమి, సీసీ నరసింహులు, రాధా, వెంకటేష్, మునిరాణి, అంగన్వాడీ సిబ్బంది, సచివాలయ సంక్షేమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల నిరోధానికి సహకరించాలి : రూరల్ సిఐ



**కుప్పం, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** సమాజంలో బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ కోరారు. శుక్రవారం స్థానిక మండల కార్యాలయంలో ఐసిడిఎస్ శాఖచే కిశోర వికాసం శిక్షకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలపై ప్రజలకు తగు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే వారికి కలిగే పిల్లలు సైతం లోపాలతో, అనారోగ్యంతో జన్మిస్తారన్నారు. చిన్న వయసులోనే పిల్లలకు వివాహాలు చేస్తే వారి మానసిక స్థితి సైతం భవిష్యత్తులో దెబ్బతింటుందన్నారు. అలాగే మంచి,చెడుల గురించి బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా పిల్లల తల్లిదండ్రులు తమ సమయాన్ని సెల్‌ఫోన్లతో కాక పిల్లలతో గడిపేలా చొరవ చూపించాలని సూచించారు. సెల్‌ఫోన్ రాకతో బాంధవ్యాలు, బంధుత్వాలు అనేవి తగ్గిపోతున్నాయన్నారు. అనంతరం వివిధ అంశాలపై వక్తలు శిక్షణ కల్పించారు. సమావేశంలో గుడుపల్లె ఎస్సై శ్రీనివాసులు, ఎంఇఒ2 రాజారాం, సిడిపిఒ కృష్ణవేణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



**కుప్పంరూరల్, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** రైతులు, ప్రజలకు సంబంధించి నెలకొన్న భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దార్ చిట్టిబాబు పేర్కొన్నారు. శుక్రవారం వసనాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని జడ్పీహైస్కూల్‌కు సంబంధించిన ఆట స్థలాన్ని తహశీల్దార్ పరిశీలించారు. కార్యక్రమంలో నేతలు మునికృష్ణ, సుబ్బు, మాజీ సర్పంచ్ మురళి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌కు ఎల్ఇడి టివి వితరణ



**శాంతిపురం, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** మండలంలోని రాళ్లబూదుగూరు గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు బసవరాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు 79వేల విలువ చేసే ఎల్ఇడి టివిని వితరణగా అందించారు. తన కుమారుడు దివంగత కిరణ్ జ్ఞాపకార్థం తనవంతుగా పోలీసుశాఖకు ఉపయోగపడేలా టివిని అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, హెడ్‌కానిస్టేబుల్ పరమేష్, దేశం నేత రాము, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల ద్రోహి జగన్... రైతు బాంధవుడు చంద్రబాబు

– మాజీ ఎమ్మెల్సీ గౌనివారి



**శాంతిపురం, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉన్న రైతులకు జగన్ ద్రోహి అని సిఎం చంద్రబాబునాయుడు రైతు బాంధవుడు అని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. జగన్‌కు రైతులంటే గౌరవం లేదని, రైతుల సంక్షేమంపై ఆయన దృష్టి పెట్టలేదన్నారు. వైకాపా పాలనలో వ్యవసాయాన్ని, రైతులను విస్మరించారన్నారు. రైతు భరోసా అంటూ ఏడాదికి రూ 7500లు ఇచ్చి అన్ని పథకాలు, రాయితీలు నిలిపేసి గిట్టుబాటు ధరలు లేకుండా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వైకాపా పాలనలో ప ంటల బీమా పథకం అస్తవ్యస్తంగా చయడంతో పాటు ధాన్యం సేకరణలో సైతం రైతులకు అన్యాయం చేశారన్నారు. 2014-19లో రైతులసంక్షేమంకు సిఎం చంద్రబాబు 40772కోట్లు ఖర్చు చేశారన్నారు. అదే జగన్ పాలనలో రైతులు 25428కోట్లు నష్టపోయారన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అగ్నిప్రమాదాల పట్ల జాగ్రత్త అవసరం



**పుంగనూరు,డిసెంబరు 13 ప్రభాతవార్త :** అగ్నిప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎంతో అవసరమని అగ్నిమాపక కేంద్ర అధికారి సుబ్బరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు విద్యార్థులు గ్యాస్ సిలెండర్ నిర్వహణ వంటి విషయాలపై అవగాహన లేకుండా వాటిని తాకరాదన్నారు. ఇండ్లల్లో,హోటళ్లలో వాడే గ్యాస్ సిలెండర్ల ఉపయోగించే విధానం పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. లేనిపక్షంలో వాటిని పెద్దల సమక్షంలోనే వాడాలన్నారు. శివకుమార్‌గ్యాస్‌ఏజెన్సీస్‌అధినేతశివ,హాస్టల్‌వార్డెన్‌విజయభాస్కరరెడ్డి, విద్యార్థులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సబ్‌కోర్టు న్యాయమూర్తిగా ఆరిఫాషేక్



**పుంగనూరు రూరల్,డిసెంబరు 13 ప్రభాతవార్త :** స్థానిక సబ్‌కోర్టు న్యాయమూర్తిగా ఆరిఫాషేక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కుప్పం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తిగా ఉన్న ఆమెకు పదోన్నతి లభించడంతో ఇక ్కడ చేరారు. జమీందారి భూముల వ్యవహారంలో అనేక కేసులు అపరిష్కారంగా ఉన్న సమయంలో మహిళాన్యాయమూర్తి ఇక్కడ సీనియర్ డివిజన్ పదోన్నతిపై రావడంతో కేసుల సత్వర పరిష్కారాలు సాధ్యమౌతాయని స్థానికులు భావిస్తున్నారు. బార్ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు,న్యాయవాదులు,ఆమెకు స్వాగతం పలికారు.

## గణనాధుని సన్నిధిలో పలువురు ప్రముఖులు



**కాణిపాకం,డిసెంబర్ 13 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని శుక్రవారం ఏపీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, చిత్తూరు నగర మేయర్ అముదలు వేర్వేరుగా కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి టెంపుల్ బాలాజీ నాయుడు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. తులసిరెడ్డి వెంట ఏపీసీసీమాజీ కార్యదర్శి ఏపీ.పరదేశి, కాణిపాకం ధనలక్ష్మీ,బిసీ నేత బుల్లెట్ రవితదితరులు పాల్గొన్నారు.

## లడ్డూపోటు, పడితరం స్టోర్‌ను పరిశీలించిన ఈఓ

**కాణిపాకం, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానం లడ్డూపోటు, పడితరం స్టోర్‌లను ఆలయ పెంచల కిషోర్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా అడ్డూపోటులో స్వామివారి ప్రసాదం లడ్డూ, వడ ప్రసాదాల తయారీ విధానాన్ని పరిశీలించారు. అలాగే లడ్డూ, వడ ప్రసాదాలకు వాడే సరుకుల నాణ్యతను పరిశీలించారు. అలాగే లడ్డూ పోటులో ప్రతి రోజూ ఎన్ని లడ్డూ వడలు తయారవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. లడ్డూ పోటులో పరిశుభ్రంగా వుంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే పడితరం స్టోర్‌ను సందర్శించి సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈఓ వెంట ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్ వాసు తదితరులు వున్నారు.

## కిశోర వికాసం-బాలికల సాధికారితకు పునాది : సీడీపీఓ



**తవణంపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** కిశోర వికాసం ద్వారా బాలికల సాధికారికత సాధ్యమని ఐసీడీఎస్ ఐరాల ప్రాజెక్ట్ సీడీపీఓ జి.నిర్మల అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సామావేశ మందిరంలో కిశోర వికాసం కార్యక్రమంపై వివిధ శాఖల సిబ్బందికి ఒకరోజు శిక్షణా కార్యక్రమంను నిర్వహించారు. జిల్లా బాలల పర్యవేక్షణాధికారి సుబ్రమణ్యం, ఎంపీడీఓ రెడ్డిబాబు, ఎంఈఓ త్యాగరాజులురెడ్డి, వైద్యాధికారి డాక్టర్ వినయ్, ఎస్సై చిరంజీవిలు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, విద్యమెక్క ప్రాముఖ్యత, రుతుక్రమం, వ్యక్తిగత పరిశుభ్రత, బాలల చట్టాల గురించి వివరించారు.మండలంలోని మహిళా పోలీసులు, వెల్ఫేర్ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్ వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

## 17న పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

**కాణిపాకం, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధిపై ఈనెల 17న కాణిపాకంలో సమీక్షా సమావేశం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే మురళీమోహన్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు వివిధ ప్రభుత్వ శాఖల నియోకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈసమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## సమస్యలు పరిష్కారంతోనే సార్థకత



**చౌడేపల్లి, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** రెవిన్యూ సదస్సుల్లో రైతులు తమ సమస్యలను పరిష్కరించుకొన్నప్పుడే సార్థకత వుంటుందని సర్పంచు శ్రీరామ్ వరుణ్‌భరత్, తేదేపా నాయకులు హరిరాయల్, సాగర్‌నాయుడులన్నారు. స్థానిక సచివాలయం-1లో రెవిన్యూ సదస్సు జరిగింది. భూసమస్యల శాశ్వత పరిష్కార వేదికలుగా రెవిన్యూ సదస్సులుంటాయన్నారు. చౌడేపల్లి పట్టణంలోని 158-4లో గల 23ఎకరాల్లో 20యేళ్ళ క్రితం రిజిష్టర్లు అయ్యేవనీ, అయితే ప్రస్తుతం కావడం లేదని గ్రామస్తులు సాయి కిరణ్, హరి, నరేష్, గణశ్యామ్‌లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. పరిశీలించి న్యాయం చేస్తామని డిటి మాధవి వారికి హామీ ఇచ్చారు. అనంతరం రెవిన్యూ సదస్సును గురించి వివరించారు. ఆర్ఐ భారతి, మండల సర్వేయర్ గుణశేఖర్, విఆర్వోలు విజయ్‌కుమార్, శ్రీపతిరెడ్డి, కార్యదర్శి మహేష్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## గంగా భవానీకి రాహుకాలాభిషేకం



**బోయకొండ(చౌడేపల్లి), డిసెంబర్ 13 ప్రభాతవార్త :** శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మ వారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో వేద ఆలయ అర్చకులు, పండితులు గోవర్ధనశర్మల ఆధ్వర్యంలో జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. అనంతరం పాత కళ్యాణకట్ట భవనంలో అన్న దానశిబిరాన్నిఏర్పాటు చేసారు. ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం స్వయంగా భక్తులకు వడ్డించారు.

# తిరుపతి డివిజన్

## చెత్త సేకరణ విధిగా నిర్వహించాలి : కమిషనర్



**తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** తిరుపతి నగరంలో ప్రతి ఇంటి వద్ద, వ్యాపార సముదాయాల వద్ద నుండి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరణ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వాహనాల జి.పి.ఎస్. ట్యాగింగ్, వాహనాల రూట్ మ్యాప్ తదితర అంశాలపై హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ఇంటింటి వద్ద నుండి, వ్యాపార సముదాయాలు, అపార్ట్మెంట్లు నుండి తడి, పొడి చెత్త సేకరణ విధిగా చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డి.ఈ.లు మహేష్, రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.సి.పి. మాహాపాత్ర, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతీ, శానిటరీ ఇన్స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్అండ్‌బీ స్థలంలో వర్షపునీరు...

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 13 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నవంబరు నెలలో వరుసుగా తుఫాను రావడం జరిగింది. తుఫానుకు ముందే అక్కడి కాలనీ వాసులు వర్షపునీరు పోకుండా అక్రమ దారులు మట్టి తోలకం చేపట్టినీటి పారుదలను అడ్డుకోవడం జరిగిందని వీఆర్‌వో జగదీష్‌కు తెలియజేశారు. అప్పటి నుంచి సమస్యను పరిష్కరిస్తామని చెబుతూ కాలయాపన చేశారు. నేడు తుఫాను ప్రభావంతో వర్షం కురవడం వలనపై నుంచి వచ్చే వర్షపు నీరు ప్రవహించేందుకు మార్గం లేక నిలిచిపోవడంతో వరద నీరు రోడ్లపై నిలిచి, ప్రహరీగోడలను, ఇళ్ళను నిండుకుని నడిచేందుకు దారి లేక ప్రహరీ గోడలు, ఇళ్లు ఎప్పుడు నీటి ఎద్దడికి గుర్రై కూలుతాయో అర్థం కాక సంబంధిత నివాసి వాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై వీఆర్‌వో జగదీష్‌కి ఫోన్ చేస్తే మాకు సంబంధం లేదని, శానిటేషన్ వర్కలు ఎంపీడీవో ఆఫీసు సెక్రటరీ సంబంధం అని తెలిపారు. సంబంధిత సెక్రటరీ ఫోన్ చేస్తే రాత పూర్వకంగా లెటరు ఇస్తారా పరిశీలిస్తాం అంటున్నారని, అకాల వర్షం తుఫాను ప్రభావం ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడవలసిన అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకోవడం అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ప్రజలకు ఆస్తి నష్టం ప్రాణం నష్టం జరిగితే కాని అధికారులు ముందుకు రారా అందుకేనా అధికార యంత్రాంగం ఉండేది.

## జలదిగ్గంధంలో కారణి



**బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 13 ప్రభాతవార్త:** తుఫాను ప్రభావంతో నీటి ప్రవాహం పెరిగి కారణి పంచాయతీలోని పాత కారణి గ్రామంలోని 40 కుటుం బాలు రాకపోకలు నిలిచిపోయి జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గ్రామానికి వచ్చే దారి మార్గం పై నుంచి నీటి ప్రవాహం వలన పూర్తిగా నిండుకోవడంతో రాకపోకలు నిలిచిపోవడం జరిగింది. ప్రతిసారి వర్షాలు అధికంగా కురిసినప్పుడు ఈ గ్రామం పరిస్థితి ఇలాగే ఉంటుంది. చిన్న పిల్లలకు పాలు ఆహార పదార్థాలు అందక, వృద్ధులు అనారోగ్య బారిన పడిన రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిసారి ప్రజాప్రతినిధులకు గ్రామ సర్పంచ్‌లకు రోడ్డు సౌకర్యం మెరుగుపరచాలని విన్నవిచ్చినప్పటికి కాలయాపన చేస్తూ వ్యవహరిస్తున్నారు. ఈ గ్రామస్తులకు ఒకటే రోడ్డు మార్గం ఉండడం వలన వర్షాలు ప్రభావం వలన చాలా దిగ్బంధంలో చిక్కుకున్నప్పుడు ఎటు వెళ్లేందుకు మార్గం లేక ఇళ్ళకే పరిమితమై నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులువాపోతున్నారు.అధికారులుస్పందించిరోడ్డు మార్గంను విరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

## భూ సమస్యలను రికార్డులను సరి చేసుకోండి



**కేవీబీపురం, డిసెంబరు 13 ప్రభాతవార్త:** మండలంలోని ఎగువ పుత్తూరు, కోటమంగాపురం గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సదస్సులను తహసీల్దార్ మునిరత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సదస్సులో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందని, అందరూ పాల్గొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రతి అర్జీకి కూడా రసీదు ఇవ్వబడుతుందని సమస్యల పరిష్కారానికి సదస్సులని తెలిపారు.కూటమి నాయకులు థామస్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి మునింద్ర, వీఆర్‌వో మునిభాస్కర్, వంశి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ప్రతి పాదనపై ఉద్యోగ అవకాశం



**తిరుపతి హెల్త్, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** ఎస్ వి వైద్య కళాశాలలో నాన్ కమ్యూనికబుల్ డిసీస్ కంట్రోల్, ఏంటి మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏ. ఎం.ఆర్) సర్వేలన్స్ ప్రోగ్రామ్ క్రింద ఒక సంవత్సరం పాటు కాంట్రాక్ట్ ప్రాతిపదికన తిరుపతిలోని ఎస్ వి వైద్య కళాశాలలో పనిచేయడానికి ఎన్‌సిడిసి యొక్క ఎఎంఆర్ ల్యాబ్ టెక్నీషియన్, డేటా మేనేజర్ పోస్టులకు సంబంధించిన, పై పోస్టుల చిత్తూరు, తిరుపతి జిల్లా అభ్యర్థులు కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరారు. ఈ పోస్టుల వివరాలు వెబ్‌సైట్ నందు ఉంచారు. అర్హత కలిగిన అభ్యర్థులు నుండి దరఖాస్తులు ఉద్యోగాలకు అన్ని అర్హతలు కలిగిన అభ్యర్థులు 16వ తేది నుండి 26వ తేది లోపల ప్రభుత్వ పని దినములలో దరఖాస్తు చేసుకునవలెనని కోరడమైనది. ఈ సందర్భంగా ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపల్ డాక్టర్ పిఏ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## స్విమ్స్‌లోఆధ్వర్యంలో సివిడి ప్రోగ్రామ్



**తిరుపతి హెల్త్, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) బయోటెక్నాలజీ విభాగం వారి ఆధ్వర్యంలో 13వ తేది స్విమ్స్ శ్రీ పద్మా వతి ఆడిటోరియం నందు వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించిట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలియజేశారు. స్విమ్స్ డీన్ డా. అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డా. అపర్ణ ఆర్ బిట్లా, హైదరాబాద్ నగరానికి చెందిన డా. సత్యవ్రతన్ గోవిందరాజన్ ప్రిన్సిపాల్ ఇంజనీర్, నోవర్ట్స్ టెక్నాలజీస్ ప్రై.లిమిటెడ్, స్కూల్ ఆఫ్ బయలాజికల్ సైన్స్ స్, ఐసర్, తిరుపతి డా. ఎస్.రామ్ కుమార్, బయోటెక్నాలజి విభాగాధిపతి డా. పి.వి.జి.కె. శర్మ, స్విమ్స్ న్యూరో సర్జరీ సీనియర్ ప్రొఫెసర్ డా బి.సి.ఎం ప్రసాద్, సర్జికల్ ఆంకా లజి విభాగాధిపతి డా .నరేంద్ర, న్యూరో సర్జరీ విభాగాధిపతి డా. వి.వి.రమేష్ చంద్ర, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా. వనజాక్షమ్మలు సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బయో ఇన్ఫర్మెటిక్స్ విభాగాధిపతి డా ఉమమహేశ్వరి, కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డా. నాగ రాజ్. బయో కెమిస్ట్రీ డా అభిజిత్ చౌదరి, వివిధ విభాగాధిపతులు, వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ వర్సిటీకి బాంబు బెదిరింపు!



**తిరుపతి విద్య, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** తిరుపతిలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీలో శుక్రవారం యూనివర్సిటీలో బాంబు పెట్టినట్లు యూనివర్సిటీ అధికారులకు శుక్రవారం మెయిల్ రావడంతో వెంటనే స్పందించి తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ సిఐ. చిన్న గోవిందుకు సమాచారం అందిం చడంతో సంఘటన స్థలానికి తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ. మూర్తి సంఘటన స్థలానికి వెళ్లి డాగ్స్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ తో విస్తృతంగా తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు.సిఐ మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

## రైల్వేస్టేషన్‌ను సందర్శించిన ఎంఎల్ఏ



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహసిలో ఉన్న రైల్వేస్టేషన్‌ను శుక్రవారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పరిశీలించారు. శ్రీకాళహస్తిలోని రైల్వేస్టేషన్‌లో వసతులపై ఆరా తీసి ప్రయాణీ కులకు సౌకర్యంగా ఉండేటట్లు ఏర్పాటు చేయాలని అందుకు తగిన నిధులను కేంద్రప్రభుత్వం నుంచి తీసుకువస్తామని రైల్వేస్టేషన్‌మాస్టర్‌కు సూచించారు. అదేవిధంగా పుణ్యక్షేత్రంలో ప్రముఖ రైల్లు ఆగేలా కేంద్రమంత్రితో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఎల్ఏతో పాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, మైనార్టీ నాయకుడు షాకిరాలీ పలువురు నాయకులు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్రాంత ప్రిన్సిపల్ రాజేశ్వరి మూర్తి కన్నుమూత



**తిరుపతి విద్య డిసెంబర్ 13 ప్రభాతవార్త:** ఎస్వీడబ్ల్యూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేశ్వరిమూర్తి (103) శుక్రవారం కన్నుమూశారు. పద్మావతి డిగ్రీ,పీజీ కళాశాలకు 1954 నుంచి 1974 వరకు దీర్ఘకాలం ప్రిన్సిపల్ గా పనిచేసిన ఆమె కళాశాల శిల్పిగా పేరుగాంచారు.మహిళా విద్యను ప్రోత్సహించాలనే తపనతో 60 ఎకరాల విస్తీర్ణం టీటీడీ నుంచి సాధించి ఎస్వీ డబ్ల్యూ కళాశా భనవన నిర్మాణలను చేపట్టి కళాశాలను అభివృద్ధి చేశారు. ఆమె 103ఏళ్ల వరకు క్రమశిక్షణతో జీవనం గడపడం ఆదర్శనీయమని,ఆమె లేని లోటు తీర్చలేనిదని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ,వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భద్రమణి, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ భువనేశ్వరి అధ్యాపకులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు

## యువ ఉత్సవ్...యువత ప్రతిభకు చక్కని వేదిక



**తిరుపతి క్రీడ, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** యువ ఉత్సవ్ లాంటి కార్యక్రమాలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా ఉండడంతో పాటు వారిలోని ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు, దేశభక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడతాయని జిల్లా యువజన అధికారి టీటీడీ బోర్డు గౌరవ సభ్యులు జి. భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. యువతరం సానుకూల దృక్పథంతో ఈ పోటీ ప్రపంచంలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన ప్రసంగిస్తూ జీవితంలో ఎదురయ్యే గెలుపోటములను సమానంగా స్వీకరించాలని యువతకు ఉద్బోధించారు. ఈ యువ ఉత్సవ్‌లో వచ్చిన అవకాశాన్ని యువతి ,యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ సూచించారు. ఎస్పిఎంవివి డీన్ డాక్టర్ కాత్యాయని మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత తాము అనుకున్న లక్ష్యాలను సాధిం చాలని హితవు పలికారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి జి. జ్ఞానశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ యువ ఉత్సవ్‌లో భాగంగా ఇండియా 2047 నాటికీ దేశం ప్రపంచానికి దిక్సూచిలా ఉండాలన్నారు. అనంతరం కల్చరల్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ శైలేశ్వరి మాట్లాడుతూ ప్రజలలో మన దేశం విభిన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వం గురించి ప్రశంసలను సృష్టించడం చేయవచ్చని తెలిపారు. సెట్విన్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి కే మోహన్ మాట్లాడుతూ భారతదేశం ఇటీవల సంవత్సరాలలో వివిధ రంగాలలో సాధించిన ముఖ్యమైన పురోగతిని ప్రదర్శించడానికి యువ ఉత్సవాలు లాంటి కార్యక్రమాలు చక్కని వేదిక అన్నారు. ఈ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన యువత, ఎస్పిఎంవివి కళాశాల యువతీ యువకులు పాల్గొన్నారు.

## వర్షపునీరు నిలవకుండా చూడండి

**తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రజలకు సురక్షితమైన నీరు సరఫరా చేయాలని, పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. వర్షాల వలన నీరు నిలిచిన లక్ష్మి పురం, నారాయణపురం, తదితర ప్రాంతాలను ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మనం సరఫరా చేసే నీరు, వర్షపు నీరు కలవకుండా తగు జాగ్రత్తలు తీసుకుని ప్రజలకు సురక్షితమైన నీరు సరఫరా చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా మురుగునీటి కాలువల్లో చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలని అన్నారు. ఎక్కడైనా వర్షపు నీరు నిలిస్తే అక్కడ దోమల లార్వాలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేసి దోమల నివారణకు పాగింగ్ చేయాలని అన్నారు. మెరుగ్గా పారిశుద్ధ్య పనులు చేపట్టి, బ్లీచింగ్ చెల్లించాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి బాలాజి, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, తదితరులు ఉన్నారు.



## నష్టం ఆపారం...ఆదుకోకుంటే కష్టం!



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 13 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బంగాళా ఖాతంలో అల్పపీడనం అల్లకల్లోలం సృష్టించింది. అసలే కష్టాలు,కన్నీళ్లతో వ్యవసాయం సాగిస్తున్న రైతులకు మరో సారి ప్రకృతి విలయ తాండవం వల్ల వేదనలే మిగిలాయి.నవంబర్, డిసెంబర్ సాధారణ సగటు వర్షపాతం 475 మి.మీలు కాగా నవంబర్ మాసంలో వరుణుడు నాలుగు రోజుల్లో 320 మి.మీల వర్షపాతం నమోదైంది.ప్రతి మండలంలోనూ ఇలాగే నాలుగురోజుల్లో కనీసం రెండు నెలల్లో 450మి.మీల వర్షపాతం నమోదైంది. వర్షం భీభత్సం సృష్టించింది కానీ చెరువులు కుంటలు పొంగి పొర్లుతున్నాయి.దాంతో వర్షం కురిసినపుడు భయభ్రాంతులైన రైతులు, ప్రజలు వర్షం నిలిచిన తరువాత భూగర్భ జలాలు పెరిగినాయని ఆనందవ్యక్తం చేస్తున్నారు. శ్రీకాళహస్తి డివిజన్‌లో కురిసిన వర్షాలకు వ్యవసాయం దెబ్బతిన్నది. ఈ మేరకు వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. భారీ ఎత్తున వరిపంటకు నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలంలోని గ్రామాల్లో 502 హెక్టార్లు,ఏర్పేడు మండలంలో 385 హెక్టార్లు,తొట్టంబేడు మండలంలో 231హెక్టార్లలో, బుచ్చి నాయుడు కండ్రిగ మండలంలో 412 హెక్టార్లలో,కెవిబిపురం మండలంలో 139హెక్టార్లలో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తుందని రమేష్‌రెడ్డి వివరించారు. కాగా హార్టికల్చర్ అధికారి పుష్పలత అందించిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం వరకు అందిన సమా చారం మేరకు రేణిగుంట మండలంలోని కరకంబాడి పరిసరాల్లో మామిడి తోటలు 5హెక్టార్లలో అరటి 10హెక్టార్లలో బెండ 2 హెక్టార్లలో దెబ్బతన్నట్లు సమాచారం. రామాపురం చెరువు తెగటంతో 40 హెక్టార్లలో ఇసుకమేట వేసినట్లు సమాచారం అందిందని అధికారులు వివరించారు.

## రేణుకాదేవిని పరామర్శించిన రిషితారెడ్డి

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** ఇటీవల ప్రమాదానికి గురై ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ తెలుగుదేశంపార్టీ రాష్ట్ర తెలుగు మహిళ నాయ కురాలు రేణాకాదేవిని స్థానిక ముత్యాలమ్మగుడివీధిలో ఉన్న ఆమె నివాసంలో ఎంఎల్ఏ సతీమణి బొజ్జలరిషితారెడ్డి వెళ్ళి పరామర్శించారు. త్వరలోనే కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. పరామర్శించిన వారిలో పట్టణ అధ్యక్షురాలు మల్లీశ్వరి, మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు

## స్కిమ్స్ కళాశాలలో విద్యార్థులకు వర్క్‌షాప్

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి సమీపంలో ఉన్న స్కిమ్స్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ ఆధ్వర్యంలో 'ఫైనాన్సియల్ ఎడ్యు కేషన్ ఫర్ యంగ్ సిటిజన్స్ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ మిద్దెలహరి జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా, ప్రిన్సిపల్ గీతాదేవి, ఎన్ఐఎస్ఎం అప్రూవల్ ట్రైనర్ డాక్టర్ బి.నాగార్జున, అధ్యాపక బృందం మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు హజరయ్యారు. కార్యక్రమంలో మ్యూచువల్ ఫండ్స్, ప్రైమరీ మార్కెట్స్, సెకండరీ మార్కెట్స్, ఇంపార్టెన్స్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్, ఫైనాన్సియల్ ఆపర్చునిటీస్, కెరీర్ ఇన్ సెక్యూరిటీ మార్కెట్స్ అనే అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఐఎస్ఎం అప్రూవల్ ట్రైనర్ డాక్టర్ బి.నాగార్జునను సత్కరించారు.

## స్వర్ణాంధ్ర 2047 విడుదలలో నాయకులు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో స్వర్ణాంధ్ర2047 విజన్ డాక్యుమెంట్ విడుదల కార్యక్రమంలో సిఎం నారాచంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంత్రులు, ఎంఎల్ఏలు, డ్వాక్రా మహిళలు, అమరావతి రైతులు, తెలుగుదేశంపార్టీ కుటుంబసభ్యులు కార్యకర్తలతో పాటు శ్రీకాళహస్తి నుంచి తిరుపతి పార్లమెంటు రైతుఉపాధ్యక్షుడు తక్కలపాటి ప్రకాష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి

**వరదయ్యపాలెం, డిసెంబర్ 13 ప్రభాతవార్త :**తుఫాన్ ప్రభావితమైన సమస్యలపై గోవర్ధనపురం వంతెనను పరిశీలించారు. ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరే విధంగా చూస్తామని తెలిపారు. ఆయకట్టు ఎన్నికలు విషయంపై తహసీల్దార్ రాజశేఖర్‌కు సూచనలు,సలహాలు అందజేశారు. ఆయకట్టు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు

## కళాఉత్సవ్‌లో పుత్తూరు విద్యార్థినికి ప్రతిభా పురస్కారం

**తిరుపతి క్రీడ, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ పోటీల్లో పుత్తూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అభ్యసిస్తున్న 10వ తరగతి విద్యార్థిని తన్మయశ్రీ ఉత్తమ ప్రతిమ పురస్కారం అందుకుంది. శాస్త్రీయ సంగీత విభాగంలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ స్థానం లో నిలిచింది. ఎస్సీ ఈఆర్టీ డైరెక్టర్ ఎం.వి.కృష్ణారెడ్డి చేతుల మీదుగా ప్రశంశాపత్రంతో పాటు జ్ఞాపికను అందుకుంది. పురస్కార గ్రహీత తన్మయశ్రీని పాఠశాల ఉపాధ్యాయులు సంగీతం టీచర్ ఆషా దీపిక పలువురు అభినందించారు.

## తాగి వాహనాలు నడిపిన 15 మందిపై కేసులు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి టూటౌన్ పరిధిలో వాహనాలను తప్పతాగి నడిపిన 15 మందిపై కేసులు నమోదు చేసినట్లు సిఐ వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి తెలిపారు. ఈ కేసులకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణంలోని టూటౌన్ పరిధిలో తప్పతాగి వాహనాలు నడిపిన 15 మందిపై కేసులు నమోదు చేసి ఒక్కొక్కరి నుంచి రూ.10వేల జరిమానాలు వెరసి రూ.1.5లక్షలు వసూలు చేసినట్లు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## వపవోగా బాధ్యత స్వీకరించిన గౌరీ

**వరదయ్యపాలెం, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** వరదయ్యపాలెం మండలంకు నూతన అగ్రికల్చర్ ఆఫీసర్‌గా గౌరీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె అనంతపురంలో సాయిల్ టెస్టింగ్ లేబరేటరీలో విధులు నిర్వహిస్తుండగా అక్కడి నుంచి బదిలీలో భాగంగా వరదయ్యపాలెంకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏవో సత్యవేడుకు బదిలీ అయ్యారు.

## జలదిగ్బంధంలో పలు గ్రామాలు

**వరదయ్యపాలెం, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** వరదయ్యపాళ్యెం మండలం లోని అంబూరు, మరదవాడ, సంత వేలూరు గ్రామాలు వర్షాలకు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సంత వేలూరు చెరువు, పులిబొంద, మార్ల మడుగు ఆనకట్టలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ రెండు గ్రామాలు జలమయమయ్యాయి. వరి పంట నీట మునిగింది. విద్యుత్ సరఫరా ఆగిపోయింది. రవాణా సౌకర్యం ఆగిపోయింది.కనీసం మంచి నీటి సౌకర్యం స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికల్ ఆవిష్కరణ

**తిరుపతి విద్య, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** టొయోటా కిర్లోస్కర్ మోటర్ సెడాన్ టు ది కోర్ గా రూపొందించబడిన పూర్తి సరికొత్త క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టొయోటా కిర్లోస్కర్ మోటర్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మసకాజు యోషిమురా మాట్లాడుతూ కార్బన్ న్యూట్రల్ లక్ష్యాలను సాధించడంలో తమ నిబద్ధతను ఉందన్నారు. సేల్స్ సర్వీస్‌యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ మాట్లాడుతూ ఆల్ న్యూ క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికల్ ఆవిష్కరణ భారతదేశంలో మాకు ఒక ఉత్తేజకరమైన మైలురాయి అన్నారు.దీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిగురువాడ రెవెన్యూ సదస్సులో 24 ఫిర్యాదులు



***తిరుపతిరూరల్,డిసెంబర్ 13 ప్రభాతవార్త:*** తిరుపతిరూరల్ చిగురువాడ గ్రామ పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 24 ఫిర్యాదులు అందినట్లు తహశీల్దార్ రామాజులనాయక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కరించుటకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి, విఆర్వో రమేష్ పాల్గొన్నారు..

## అధికారులు అన్ని వసతులు కల్పించాలి : ఎమ్మెల్యే

**కేవీబీ పురం, డిసెంబరు 13 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలోని తిమ్మ సముద్రం, జయలక్ష్మిపురం, పూడి, కోవనూరు మార్గాల్లో ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. ప్రజలు అధికారుల సూచనలు పాటించి వారికి సహకరించాలన్నారు. వరదలు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలు కాలువలు, వాగులు దాటకుండా ఉండాలని, వరదలు పారె మార్గాల్లో రాకపోకలను బంద్ చేసి ఎస్ఐ, తహసీల్దార్‌లు పర్యవేక్షించి తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.

## మంచినీరు, పారిశుద్ధ్యంలో రాజీ లేదు : ఎమ్మెల్యే



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 13 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి మున్సిపల్ ఆదాయాలను పెంచుకునేందుకు మార్గాలను అన్వేషించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఆయన మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. కమిషనర్‌గిరి కుమార్ నివేదికను అందిస్తూ శ్రీకాళహస్తి మున్సిపల్ పన్నుల రాబడి ఏడాదికి రూ.8కోట్లు అని ఇప్పటి వరకు 40శాతం పన్నులు వసూలు చేసినట్లు వివరించారు.అలాగే దీర్ఘకాలంగా పన్నులు బకాయిలున్న వివరాలను ఎంఎల్ఏ దృష్టికి తెచ్చారు. అలాగే మున్సిపాలిటికి దేవస్థానం ఇవ్వాల్సిన కార్‌పార్కింగ్ వాటాను గురించి వివరించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటికి దీర్ఘకాలంగా బకాయి ఉన్న లీజులను వసూలుకు సామరస్య ధోరణితో చర్యలు తీసుకోవాలన్నారు.ఎవరైనా సరే మున్సిపల్ ఆదాయాలకు గండిపెట్టేవారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో మంచినీరు,విద్యుత్ సరఫరాతో పాటు పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. వాతావరణం మారింది. ఈ సమావేశంలో ఎంఎల్ఏతో పాటు మాజీ కౌన్సిలర్, తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు,మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.కమిషనర్ బి.గిరికుమార్, ఆర్ఓ ఖాదర్‌మొహిద్దీన్,డిఇఇ సంజీవ్‌కుమార్,ఎఇఇ తేజస్విని,టిపిఓ శారద తదితరులు పాల్గొన్నారు

## సమాజం మాయలో జీవిత రహస్యాన్ని విస్మరిస్తున్నారు



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 13 ప్రభాతవార్త :** సమాజం మాయలో మానవుడు తన జీవిత రహస్యాన్ని తెలుసుకోలేక సతమతమౌతున్నారని హాఫీజే ఖుర్ ఆన్ రేమాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియామస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా సమాజంలో సుఖశాంతులతో గడపాలంటే ఆచరించాల్సిన విధానాలను అలాగే మన ప్రవక్త ఆచరించిన జీవిత విధానాలను వివరించారు. నేడు సమాజంలో ముస్లింలు ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొంటున్నారన్నారు. కారణం మన జీవిత రహస్యాన్ని తెలుసుకోలేక పోతున్నారు.ఆధ్యాత్మిక చింతనను విడనాడుతున్నామన్నారు. ఎవరైతే అల్లాహ్ మార్గంలో నడుస్తారో దైవారాధనలో గడుపుతారో అల్లాహ్‌ను శరణుజొచ్చి ప్రార్థిస్తారో వారు ప్రశాంతంగా జీవనం గడుపుతున్నారన్నారు.అల్లాహ్ మానవునికి జీవనం అందించి సకల సుఖాలు అనుభవిస్తూ తనను ఆరాధించమంటే అన్ని అనుభవిస్తూ అల్లాహ్ ఆదేశాలను విస్మరిస్తున్నారన్నారు.దాంతో కుటుంబంలో ఆశాంతి చోటు చేసుకుంటుంది.

## రాంబట్లపల్లిలో రెవెన్యూ సదస్సు



**తొట్టంబేడు, డిసెంబర్ 13 ప్రభాతవార్త :** రెవెన్యూ సదస్సుల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కాసరం పంచాయతీ రాంబట్లపల్లిలోరెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి తహశీల్దార్ మధుసూధనరావు అధ్యక్షత వహించగా, మాజీ ఎంపిటిసి రామయ్య, సచివాలయ సర్వేయర్ విజయ్‌లోకేష్ తదితరులు హజరయ్యారు. గ్రామాల్లో అన్నదాతలకు సమస్యలు ఉండకుండా రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరగకుండా ఉండేలా చూస్తామ న్నారు. గ్రామంలోని ప్రతి రైతు ఈసమస్యను పరిష్కరించుకోవచ్చని తహశీల్దార్ వివరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డివైయస్‌పిని సత్కరించిన దేశం నాయకులు



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 13 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఏడుగంగమ్మల జాతరను ప్రశాంతంగా నిర్వహించుటకు పోలీసు అధికారి డివైయస్‌పి నరసింహామూర్తిని టూటౌన్ సిఐ వెంకటేశ్వర్లును శుక్రవారం తెలుగుదేశం నాయకులు సత్కరించారు.జాతరలో ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు వివరించారు.పోలీసు అధికారులను దుశ్శాలువలతో సత్కరించి గంగమ్మ తీర్థ ప్రసాదాలను అందించారు. సత్కరించిన వారిలో బేరివారి మండపం గంగమ్మ కమిటి కి చెందిన దుర్గా ప్రసాద్, వజ్రం కిషోర్,వినయ్‌లు ఉన్నారు.

## కూలటానికి సిద్ధంగా ఉన్న భవనం



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 13 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి ఎన్‌టిఆర్ నగర్‌లో నిర్వహిస్తున్న బాలికల హాస్టల్ పరిస్థితి దయనీయంగా ఉందని బిజెపి నాయకులు ఆవేదన వ్యక్తం చేసారు. శుక్రవారం వర్షం నిలవటంతో బిజెపి నాయకులు బిసి హాస్టల్‌ను తనిఖీ చేసారు.ఈ భవనాలు నేడో రేపో కూలిపోయే పరిస్థితిలో ఉందని గుర్తించామన్నారు. శ్లాబ్ పెచ్చులూడుతున్నట్లు గుర్తించామని,ఈ భవనం ప్రమాదంగా మారింది. ఈ పరిశీలనల్లో బిజెపి పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి శైలజ, మహిళామోర్చా తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రజ్ఞశ్రీ వెంకటేశ్వర్లు, జివి అమర్‌నాథ్,ఢిల్లికుమార్, మోహన్‌రావు,పార్వతి పాల్గొన్నారు.

## నేడు సాగునీటి సంఘ ఎన్నికలు

**విజయపురం, డిసెంబరు 13 ప్రభాతవార్త:** నేడు శనివారం మండలంలోని 12 చెరువులకు సాగునీటి సంఘ ఎన్నికలు నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఏఈఈ ప్రశాంత్ తెలిపారు. మండలంలో 12 చెరువులకు కలిపి ఓటర్లు 1205(పురుషులు), 482 (మహిళలు) మొత్తం 1687 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు మొత్తం పోలింగ్ సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించినట్టు తెలిపారు.

## కాళికాపురంలో రెవెన్యూ సదస్సు

**విజయపురం, డిసెంబరు 13 ప్రభాతవార్త:** మండలంలోని కాళికాపురంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో రెవెన్యూ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## తగ్గని వరద ఉధృత...నీటమునిగిన పంట పొలాలు

**విజయపురం, డిసెంబరు 13 ప్రభాతవార్త:**

మండలంలో వరద ఉధృత శుక్రవారం కూడా తగ్గలేదు. మండలంలోని ఒరూరు వద్ద నాగలాపురం–తిరుత్తణి రోడ్డు వరద ఉధృత పెరగడం వలన మధ్యాహ్నం వరకు వాహన రాకపోకలు కష్టమైంది. మండలంలోని గొల్లకండ్రిగ వద్ద చెరువు మొరవ పారడంతో వర్షపునీరు నిలిచిపోవడంతో పంట పొలాలు నీటమునిగింది. రోడ్డు మరమ్మతుల్లో భాగంగా మొరవ నీరు వెళ్ళడానికి ఉన్న పైపులైన్ పూడి పోవడంతో వర్షపునీరు నిల్వ ఉండడంతో పంచాయతీ బోరు నీట మునిగి ఆ నీటిని తాగవలసి వస్తున్నదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇళ్ళత్తూరు వద్ద చెరువుకు వచ్చే వరవ కాలును ఆక్రమణ చేయడంతో వరద నీరు రోడ్డుపై ఏరులై పారి వాహన రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతున్నదన్నారు. మండలంలో మొత్తం 42 చెరువుల్లో 40 చెరువులు నిండుకుండలా మారింది.

# తిరుపతి డివిజన్

## కాఫ్రికార్న్ పరిశ్రమపై చర్యలు తీసుకోండి : సీపీఎం

**సత్యవేడు, డిసెంబరు 13 ప్రభాతవార్త:** సత్యవేడు మండల పరిధిలో కాఫ్రికార్న్ పరిశ్రమ యాజమాన్యం గత 20 సంవత్సరాలకుపైగా పని చేసిన కార్మికులను అర్థాంతరంగా విధుల్లో నుంచి తొలగించడం జరిగిందని సీపీఎం పార్టీ దాసరి జనార్ధన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యూస్ పరిశ్రమ యాజమాన్యం విధుల్లో ఉన్న శ్రామికులను తొలగించడం దారుణమని అలాంటి యాజమాన్యంపై తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న కార్మిక శాఖ అధికారులు తక్షణమే స్పందించి కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులకు ఒక్కొక్కరికి 25 లక్షలు లెక్కన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## రోడ్ల మీద వర్షపునీరు



**సత్యవేడు, డిసెంబరు 13 ప్రభాతవార్త:** సత్యవేడు నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో వర్షాలకు తడిసి ముద్దయింది. రోడ్ల మీద వర్షపునీరు పరవళ్లు తొక్కుతున్నాయి. పీవీపురం గోడేరు బ్రిజీపై వర్షం నీరుతో బస్సు సౌకర్యం ఆగిపోయింది. సత్యవేడులో ప్రధానంగా గాంధీ విగ్రహం, తిరుపతి బస్టాండ్, శ్రీకాళహస్తి బస్టాండ్ పరిసరాల్లో నిత్యం నిర్వహించే చిరు వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## మా దేవాలయ భూములను సర్వేతో గుర్తించండి



**సత్యవేడు, డిసెంబరు 13 ప్రభాతవార్త:** తిరుపతిజిల్లా సత్యవేడు మండలం వా నెల్లూరు గ్రామంలో ఉన్న దేవాలయాలకు సంబంధించిన భూములను గుర్తించి వాటిని సర్వే చేయాలని పలువురు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. శుక్రవారం నెల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ ఆశాలత ఏబీ నైజర్ అధ్యక్షతన తహసీల్దార్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పలు భూ సంబంధిత సమస్యలపై అధికారులకు వినతులు సమర్పించారు. గ్రామంలో శ్రీ వెంకటేశ్వర, గ్రామదేవత మూగారమ్మ, శివాలయం, అల్లాస్వామి తదితర దేవాలయాలకు మాన్యాలు ఉన్నట్టు గ్రామస్తులు పలువురు పేర్కొన్నారు. మాన్యపు భూములను సర్వే చేయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. తమ తల్లి వనమ్మ పేరుతో ఉన్న డీకేటీ భూములను వేరే వారి పేరుతో నమోదై ఉన్నట్లు కుమారుడు సురేందర్‌రెడ్డి అధికారులకు విన్నవించారు. సర్వే నెం.186/3ఏ తమస్వాధీనంలో ఉన్న మూడు ఎకరాల భూములు సంబంధించి ఆన్‌లైన్‌లో వారు పేరుపై నమోదైనట్లు రైతు రమేష్ సతీమణి చిత్ర అధికారులకు వినతి సమర్పించారు.ఇన్‌చార్జి ఆర్ఐ సురేష్, మండల సర్వేయర్ చంద్రశేఖర్, సచివాలయసర్వేయర్ వెంకటేష్, వీఆర్‌వో రమేష్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పొంగి పారిన కేశస్థలీనది



**నగరి, డిసెంబరు 13 ప్రభాతవార్త:** వరుస వర్షాలకు కృష్ణాపురం డ్యాం నిండడంతో గురువారం రాత్రి గేట్లు తెరిచారు. దీంతో కుశస్థలీనది నీటితో ఉప్పొంగి పారింది. నదిలో ఏపుగా పెరిగిన ముళ్ళ కంపలను ముందుకు తోసుకుంటూ కుశస్థలీనది ముందుకు ఉరిగింది. యథావిధిగా నది నీరు కీళపట్టు మార్గం వైపు ఉన్న లో తట్టు వెంతన పై నుంచి వేగంగా పారడంతో ఆ వైపు రాకపోకలను ఆపేశారు. పోలీసులు ఎవరూ ఆ వైపు వెళ్ళకుండా భద్రతా చర్యలు చేపట్టారు. డ్యాం గేటు తీసిన ప్రతిసారి ఇదే పరిస్థితి ఎదురవుతోందని వంతెనపై రోడ్డు తీవ్రంగా ఛిద్రమవడంతో పాటు పలుమార్లు కొట్టుకుపోతుందని, హై లెవెల్ వంతెన వస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనుకున్నామని అయితే మూడేళ్ళ పాటు జరిగిన పనులు ప్రస్తుతం ఆగిపోయిందని వంతెన పూర్తయితే మాకుఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ మార్గంపై ప్రధానంగా ఆధారపడిన గ్రామస్తులు వాపోతున్నారు. పలు ప్రాంతాల్లో నివాసాల చుట్టూ వర్షపు నీరు గుంటలాచేరింది.

## విద్యుత్ బిల్లులు దగ్ధం చేసిన సిపిఎం



**రేణిగుంట డిసెంబర్13 ప్రభాతవార్త :** ఆదానితో కుదుర్చుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలకు వ్యతిరేకంగా, స్మార్ట్ మీటర్ల వినియోగానికి నిరసనగా, పెంచిన విద్యుత్ ట్రూ అప్ చార్జీలను ఖండిస్తూ సిపిఎం పార్టీ నేతలు శుక్రవారం రేణిగుంట మండలం తిమ్మయ్య గుంట గ్రామం నందు విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు ఓ.వి.రమణ మాట్లాడుతూ తిమ్మయ్య గుంట గ్రామంలోని ఓ మహిళ కేవలం ఫ్యాను, ఫ్రిడ్జ్, మరికొన్ని లైట్ల వినియోగానికి ఏకంగా 1,538 రూపాయల విద్యుత్ బిల్లు రావడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. కార్యక్రమంలో రేణిగుంట ఏర్పేడు ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హరినాథ్, సిపిఎం పార్టీ నేతలు కృష్ణ, ఈశ్వరమ్మ, కుప్ప స్వామి, చెంగల రాయిలు, చంద్రముఖి, చంద్ర, పరశురాం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాలలో పర్యటించిన ఎమ్మెల్యే

**తిరుపతిరూరల్,డిసెంబర్ 13 ప్రభాతవార్త:** తుఫాన్ కారణంగా విస్తారంగా కురిసిన వర్షాలు నేపథ్యంలో తిరుపతిరూరల్లో ముంపు ప్రాంతాలను శుక్రవారం ఎమ్మెల్యే



నాని పరిశీలించారు. తిరుచా నూరు, ముండ్లపూడి గ్రామ పరిదిలో పర్యటిస్తున్న వంకను అధికారులతో కలిసి పరిశీలించారు. వర్షాలు మరల వస్తే ఎలాంటి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే గాంధీపురం స్మశానవాటికను పరిశీలించారు. స్మశానంలోకి నీళ్ళు వెళ్ళకుండా మహిళవర్శిటీ సర్కిల్లో డ్రైనేజ్ కలపడానికి చర్యలు చేపడతామని తెలిపారు.గాంధీపురం స్మశానానికి ప్రహరి ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, టిడిపి నేత అలిమినేని మధు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో రెవెన్యూ సబ్బంది



**రేణిగుంట, డిసెంబర్13 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా మారి రెవిన్యూ యంత్రాంగాన్ని ప్రజలకు దగ్గర చేసిందని రేణిగుంట తహసీల్దార్ సురేష్ బాబు అన్నారు. రేణిగుంట మండలం వెదళ్ల చెరువు, అనుగుంట రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సు తహసిల్దార్ సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగింది. రికార్డు ఆఫ్ రైట్ 2, చెరువు ఆక్రమణ 1, ఎల్ .ఏ.కాంపెన్సేషన్ 1, ఇనాం భూములు 1 మొత్తం 5 సమస్యలకు పరిష్కారాలు లభించాయి. భూ సంబంధితసమస్యలనుపరిష్కరించుకోవాలనితహసిల్దార్ సురేష్ బాబు కోరారు.

## పదవిని అడ్డం పెట్టుకుని మహిళపై దౌర్జన్యం!



**కేవీబీ పురం, డిసెంబరు 13 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలానికి మారు మూల ప్రాంతమైన అంజూరుపాళెం గ్రామంలో సర్పంచ్ పదవిని అడ్డుపెట్టుకుని పేదల భూములను కబ్జా చేస్తున్న హరిబాబు అలియాస్ గిరిని ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవానలి సీపీఎం జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజులు డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవిని అడ్డుపెట్టుకుని సర్పంచ్ కుమారుడు గతంలో కూడా గ్రామంలోని మాదిగలపై దాడులు చేయించి బీభత్సం సృష్టించిన విషయం అందరికి తెలిసిందే. తక్షణమే పోలీసు అధికారులు ఇంత దారుణానికి పాల్పడుతున్న సెక్షన్ కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుని మండలంలో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న భూ కబ్జాదారులకు హెచ్చరిక లాగా ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు.

## విశ్రాంత ఉద్యోగులందరూ లైఫ్ సర్టిఫికేట్లు తీసుకోవాలి

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 13 ప్రభాతవార్త :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విశ్రాంత ఉద్యోగులు,ప్రభుత్వాల పెన్షనర్లు తప్పకుండా లైఫ్ సర్టిఫికేట్లు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.ఈలైఫ్ సర్టిఫికేట్‌ను శ్రీకాళహస్తిలోని ముత్యాలమ్మగుడి వీధిలోని ఏడుగంగమ్మల గుడి పక్కన ఉన్న 'మీ సేవా కేంద్రంలో' తీసుకోవాలని సూచించారు.


**In the Court of the I Addl. CIVIL JUDGE, Benguluru Rural Dist. At Bengaluru**
M.C. No. 457 / 2024
Between
Sri K. Hemachandra ...Petitioner
And
Smt. A. Jananji ...Respondent
**NOTICE TO RESPONDENT**
Smt. A. Janani, D/o Late A. Gangi Reddy, W/o K. Hemachandra, Aged about 34 years, R/ at Gandlapalli Village, Mogili Post, Bangarupalyam Mandal, Chittoor District - 571 429, Andhra Pradesh.
Whereas the Petilioner has presented above petition before the Hon'ble Court under Sec.13(1) (ia) (1-A) of the Hindu Marriage Act, 1955 seeking the relief of Divorce to dissolve the marriage against the Respondent. Hence there in default of your appearance on the said date at time petition will be heard and determined as exparte.
You are hereby summoned to appear before this Hon'ble court in person by an advocate duly instructed able to answer to all material question relating to the petition at 11.00 am on 30-1-25 to answer the claim. Given under my hand and seal of the court, this 12th day of Dec, 2024 at Bengaluru.
By orders of the court, Chief Ministeral Officer, Senior Civil Judge Court, Bengaluru Rural District, Bengaluru.
Advocate for Petitioner :
**SRI B. VISWESWARAIAH & V. HONNAMBIKA,**
Advocates, No.37/2, Nanjamma Complex, Devasandra Main Road, K.R.Puram, Bengaluru-36, **Mob: 9480509095**



**IN THE COURT THE ADDL. SENIOR CIVIL JUDGE OF CHITTOOR**
**E.P.No. 99 of 2015**
**O.S.No. 426 of 2008**
Between
R.Balaji ...Decree-Holder
And
B.J.Bhaskar(died) and others ....Judgement-Debtors
**AUCTION NOTICE**
The schedule mentioned property is going to auctioned before the above said court on **06-01-2025** in between **10-30 A.M to 5-00 P.M.** The intending bidders may participate in the auction on said date and time before the said court.
**SCHEDULE**
Chittoor District- Chittoor Sub District- Chittoor Mandal- Chittoor Municipality- No.72 Chittoor Revenue Village accounts- S.No.478/2 Chittoor Town- Komati Veedhi(Damayanthi Veedhi) - bearing No.7-333- ground floor RCC building - 1st Floor- ACC Sheets and site within the following boundaries.
East: house of Thahera ,W/o Late Nawab, West: Road( Damayanthi Veedhi),North: house of Kumar, South: houe of Sathyanarayana.
In between measuring East to West 21 feet or 6.41 meters, North to South:11 feet of 3.36 meters of the site including ground floor RCC building and first floor measuirng 15x 9: 135 sq. feet with ACC roofing sheets- including doors,door frames, almarahs-Windows and service No.1743 wiring bulbs, switches etc and electricity deposit- in this a share.
D.Hr's Vlaue : Rs.1,73,364
Amin's Value : Rs.18,00,000/-
Sd/-P.RAMAMURTHY NAIDU
Counsel for the Decree-Holder
Place: Chittoor, Date:13-12-2024

# గగన్‌యాన్ కోసం మరో కీలక ఘట్టం

- సాలిడ్ మోటార్ సెగ్మెంట్ రూపకల్పన
- శ్రీహరికోటలో వేగంగా మానవ రహిత గగన్‌యాన్ ఏర్పాట్లు




శ్రీహరికోట (తడ), డిసెంబర్ 13 ప్రభాతవార్త : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ గగన్‌యాన్ పనుల్లో మరింత వేగం పెంచింది. ఇస్రో శాస్త్రవేత్తలు ఎప్పటి కప్పుడు గగన్‌యాన్ కోసం ఏదో ఒక కార్యక్రమాన్ని చేపడుతున్నారు. తాజాగా గగన్‌యాన్ ప్రాజెక్టు కోసం రూపొందిస్తున్న భారీ రాకెట్ ప్రయాణానికి సంబంధించి మొదటి సాలిడ్ మోటారును లాంచ్ కాంప్లెక్స్‌కు తరలించారు. గతంలో ఎల్‌వీఎం3గా నిర్మాణం జరుపుకున్న మన మార్క్3 రాకెట్లను గగన్‌యాన్ కోసం హెచ్‌ఎల్‌వీఎం3 జీ1గా రూపొందిస్తున్నారు. హెచ్ అంటే హ్యూమన్ జీ1లో గగన్‌యాన్1 చేర్చి ఈ రాకెట్‌ను చకచకా రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా జనవరిలోనే మనుషులు లేకుండా గగన్‌యాన్‌ను ప్రయోగించడానికి శ్రీహరికోటలో రాకెట్ నిర్మాణం పనులు వేగం పుంజుకున్నాయి. ఈ రాకెట్‌కు మొదటి దశ అనుబంధంగా ఉండే సాలిడ్ మోటార్ సెగ్మెంట్‌ను హెచ్‌ఎంపిసి ప్రొడక్షన్ ప్లాంట్ నుంచి ఎఫ్‌ఇఎబి అనుసంధాన భవనానికి తరలించినట్లు ఇస్రో శుక్రవారం ప్రకటించింది. శ్రీహరికోటలోని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ జెండా ఊపి ఈ సెగ్మెంట్‌ను అనుసంధాన భవనానికి వెళ్లేందుకు అధికారికంగా ప్రారంభించారు.

# గూడూరు డివిజన్

## వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



సూళ్లూరుపేట, డిసెంబర్ 13 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శుక్రవారం పర్యటించి బాధితులను పరామర్శించారు. వట్రపాలెం, సాయినగర్ తదితర ప్రాంతాలకు ఆమె వెళ్లి వరద ముంపునకు గురైన వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం కాళంగి నది, పాముల కాలువ, జాతీయ రహదారిపై వరద నీటిని ఆమె పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఆకుతోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరుగులు తీస్తున్న స్వర్ణముఖి



కోట, డిసెంబర్ 13 ప్రభాతవార్త : కోట మండలంలో రెండురోజుల పాటు కురిసిన భారీ వర్షాలతో పాటు తిరుపతి వద్ద కల్యాణి డ్యాం గేట్లు ఎత్తివేయడంతో ఆ వరద ప్రవాహం కోట మండలంలోని గూడలి వద్ద స్వర్ణ ముఖికి చేరింది. ఇక్కడ ఈ ప్రవాహం మామిడికాలువ, చల్లాకాలువ వద్ద ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో గూడలి వద్ద వంతెనపై వరద ప్రవహించడంతో మెట్టు, విద్యానగర్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వంతెనకు ఇరువైపులా పోలీసులు నిఘా ఉంచారు. ఎవరినీ వంతెన దాటకుండా అప్రమత్తం చేస్తున్నారు.

**స్వర్ణముఖి నది గండ్లు పరిశీలన**

అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాల కారణంగా స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం తహశీల్దార్ కె.జయ జయరావు పుచ్చలపల్లి, దెయ్యాలదిబ్బ ప్రాంతాల్లోని స్వర్ణముఖి నది పొర్లుకట్టలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఆయన వెంట చిల్లకూరు దశరధరామిరెడ్డి, నీటిపారుదల శాఖ ఏఇ మునిరత్నం ఉన్నారు.

**చెందోడులో రెవెన్యూ సదస్సు**

రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు శుక్రవారం కోట మండలం చెందోడు గ్రామంలో తహశీల్దార్ కె.జయజయరావు ఆధ్వర్యంలో జరిగింది. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ అజమ్మతుల్లా ఖాన్, ఆర్ఐ మధులత, సర్పంచ్ దేవారెడ్డి మాధవి, నాగూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం



సూళ్లూరుపేట, డిసెంబర్ 13 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీబాలాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం హనుమత్ వ్రతం సామూహిక సింధూర పూజను, దీపారాధన మంత్రపుష్పాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం అర్చకులు దివి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మోతుకూరి ప్రియ దర్శన్, లావణ్య కుమారి దంపతులు వ్యవహరించారు.

## అర్హులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలి




సూళ్లూరుపేట, డిసెంబర్ 13 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలంలో అర్హులైన వారందరికీ బ్యాంకుల ద్వారా రుణాలు అందజేసేందుకు చర్యలు చేపట్టాలని ఎంపిడిఓ ప్రమీలరాణి కోరారు. శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన జెఎల్‌ఎంబిసి బ్యాంకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. బ్యాంకర్లు లబ్ధిదారులకు రుణాలు అందజేయడంలో సహకారం అందించాలని ఆమె కోరారు. అలాగే మండల స్థాయిలో రెండోరోజున లోకలైజేషన్ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అనే అంశంపై సర్పంచులకు, సచివాలయ సిబ్బందికి, ఇతర అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు.

## గ్రద్ద'గుంట'లో మునిగిన వరిపైరు

- రైతులను పరామర్శించిన ఎమ్మెల్యే విజయశ్రీ



తడ, డిసెంబర్ 13 ప్రభాతవార్త : తడ మండలం గ్రద్దగుంట, చేనిగుంట, కాదలూరు తదితర గ్రామాల్లో భారీ వర్షాలకు మునిగిపోయిన పొలాలను శుక్రవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పరిశీలించారు. వర్షంలోను ఆమె తీరప్రాంత గ్రామాలకు వెళ్లి రైతుల కష్టనష్టాలను తెలుసుకున్నారు. ఈ మూడు చోట్లా పంట పొలాలు కనిపించకుండా ఎక్కడ చూసినా వరద ప్రవాహమే ఉండటం ఎమ్మెల్యే చూశారు. పంట పొలాలను ముంచెత్తిన వర్షం, వరద నీటి వలన వందలాది ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు రైతులు, టిడిపి నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పైరు మునగడంతో దెబ్బతిన్న పైరును పెరికి ఎమ్మెల్యేకి చూపించి ఈ సారి కూలీలు, ఎరువుల ధరలు పెరిగిపోవడంతో ఎక్కువగా నష్టపోయినట్లు రైతులు పేర్కొన్నారు. తెలుగుగంగ 8డి ఛానల్‌ను నిర్మాణం చేస్తే వర్షాకాలం ముగిసిన తర్వాత తాము పంట వేసుకునే అవకాశం ఉంటుందని రైతులు ఎమ్మెల్యేకి చెప్పారు. ఆమె వెంట మండల టిడిపి అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు బొమ్మన్ పళణి, కాదలూరు మాజీ సర్పంచ్ వల్లం విజయమ్మ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెంచురామయ్య, గండవరం రమేష్‌రెడ్డి, తహశీల్దార్ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి ఎన్నికలకు సర్వం సిద్ధం

చిట్టమూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త : నేడు జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇరిగేషన్ ఏఇ అబ్దుల్ గని తెలిపారు. చిట్టమూరు మండలంలోని 23 పంచాయతీల పరిధిలో 30 చెరువులకు సంబంధించిన ఎన్నికలకు శనివారం జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల అధికారులుగా ఇరిగేషన్ ఏఇ అబ్దుల్ గని, తెలుగుగంగ ఏఇ, జేఇలు పూర్ణచంద్ర రావు, మునిజ్యోతి, చిట్టమూరు డిప్యూటీ తహశీల్దార్లు నిరంజన్‌కుమార్, విజయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ మహేష్‌లతో పాటు పోలింగ్ అధికారులుగా సచివాలయ సిబ్బంది పాల్గొంటారని అబ్దుల్ గని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు.

## సదస్సులో సత్వరమే భూ సమస్యల పరిష్కారం



బాలాయపల్లి, డిసెంబర్ 13 ప్రపభాతవార్త : రెవెన్యూ సదస్సులో సత్వరమే భూ సమస్యలు పరిష్కరిస్తామని తాసిల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలం లోని వెంగమాంబపురం గ్రామ సచివాలయంలో రెవెన్యూ గ్రామసదస్సు జరిగింది. భూసమస్యలపై అర్జీదారుల నుంచి తహసిల్దార్ పి.శ్రీనివాసులు విరివిగా వినతులు స్వీకరించారు. భూ సమస్యలు తెలుసుకుని పరిష్కరిం చేందుకే ప్రభుత్వం నేరుగా గ్రామాల్లోనే ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వారికి తెలిపారు. సదస్సులో మండల సర్వేయర్ తారక రామారావు, వ్యవసాయ శాఖ అధికారిణి పి.శిరీష, వీఆర్వో పెంచలయ్య, ఎంపీటీసీ మెంబర్ చంద్రమోళి, దామా మధు నాయుడు, అక్కుర్తి పెంచలయ్య, వడ్లపూడి మురళి నాయుడు, సర్పంచ్ బి.వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం పట్టించుకోని అధికారులు



వెంకటగిరి, డిసెంబర్ 13 ప్రభాతవార్త : పట్టణంలోనే 14 అవార్డు బొగ్గులు మిట్ట, తోలు మిట్ట ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించిందని కౌన్సిలర్ ఆరి శంకరయ్య మండిపడ్డారు. వీధుల్లో పేరుకుని ఉన్న చెత్తాచెదారాన్ని పారిశుధ్య సిబ్బంది తొలగించడం లేదని ఆందోళన చెందారు. పారిశుధ్య లోపించడం వల్ల డెంగ్యూ విష జ్వరాలు ప్రబలుతున్నట్లు తెలిపారు. వెంటనే పారిశుధ్య పనులు మెరుగుపరచాలని కోరారు.

## సదస్సులను సద్వినియోగం చేసుకోండి



ఓజిలి, డిసెంబర్ 13 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బత్తల రవీందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన ఓజిలి మండలం బట్లకొనుపురు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ మధురాజు, టిడిపి సీనియర్ నాయకులు గున్నంరెడ్డి మధుసూదన్‌రెడ్డి, వీఆర్వో దిలీప్, గురవయ్య, నాగయ్య లు పాల్గొన్నారు.

## భూ సమస్యలను పరిష్కరించేందుకే సదస్సులు



గూడూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త గూడూరు మండలంలోని చెన్నూరు రెవెన్యూ పరిధిలో చెన్నకేశవ స్వామి దేవాలయంలో శుక్రవారం గూడూరు తాహసీల్దారు ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజా సమస్యలు రైతన్నల భూ పరిష్కరిం చాలని గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం నిర్వహించాలని ప్రజలు పెట్టుకున్న అర్జీలపై తక్షణం సదస్సులో స్పందించి పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతు సంఘం నాయకులు బి.వి. రమణయ్య, వి.భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్ క్లబ్ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే



గూడూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త : గూడూరు పిఆర్ క్లబ్ పేద ప్రజల కొరకు చేసే సేవా కార్యక్రమాల నిర్వహించడం అభినందనీయమని రాబోయే రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని పిఆర్ క్లబ్‌లో కమిటీ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేదలకు దుప్పట్లను అందజేశారు. ఇటీవల పట్టణంలో నేను రౌడీయిజాన్ని ప్రోత్స హిస్తున్నామని ప్రచారం జరుగుతుందని ఎప్పుడు రౌడీయిజాన్ని ప్రోత్సహించే ప్రసక్తే లేదని అసత్య ప్రచారాలను నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్ రెడ్డి, శ్రీకంటి రామ్మోహన్ రావు, మీరారెడ్డి, మధు, మస్తాన్ నాయుడు, సిద్ధారెడ్డి, వెంకటసుబ్బయ్య, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర రాజు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కృత్తికా నక్షత్ర దీపోత్సవం



కాణిపాకం, డిసెంబర్ 13 ప్రభాతవార్త: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో కృత్తికా నక్షత్ర దీపోత్సవం వేడుకలను శుక్రవారం రాత్రి అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కాణిపాకం దేవస్థానం ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో కృత్తికా నక్షత్ర దీపోత్సవం వేడుకలను నిర్వహించారు.ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఉభయదారులు కాకర్లవారిపల్లె దామోదరనాయుడు కుటుంబీకులచే ప్రధాన ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రధాన ఆలయంలో ఓంకారం, శివలింగాకారంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనితో కాణిపాకం ప్రధాన ఆలయంతో పాటు మంణికంఠేశ్వరాలయంలో కృత్తికా నక్షత్ర శోభ ఉట్టిపడింది. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి సూపరెండెంట్‌లు కోదండ పాణి, వాసు, ఎస్పై ధరణీధర, స్థానాచార్యులు పణిస్వామి, వేదపండితులు, ఆలయ ఉభయదారులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## భవిష్యత్తులో వరద ముప్పు రాకూడదు : కలెక్టర్



రేణిగుంట, డిసెంబర్13 ప్రభాతవార్త : మల్లెమడుగు రిజర్వాయర్ దిగువ గ్రామాలకు భవిష్యత్తులో ఎలాంటి వరద ముప్పు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. రేణిగుంట మండలం మల్లెమడుగు రిజర్వాయర్ ముంపు గ్రామాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ముంపు గ్రామమైన వెదళ్ళ చెరువు ఎస్టీ కాలనీ ప్రజల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలు ముంపుకు గురికాకుండా తీసుకోవలసిన చర్యలపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. గత నాలుగు సంవత్సరాల నుండి ఎలాంటి అభివృద్ధి పనులు జరగనంతవల్ల గ్రామాలు ముంపుకు గురి అవుతున్నాయని నిర్ధారణకు వచ్చారు. వెదళ్ల చెరువు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ తో పాటు రేణిగుంట తహసిల్దార్ సురేష్ బాబు, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మదన గోపాల్, టిడిపి సీనియర్ నాయకులు హైకోర్టు అడ్వకేట్ ఉదయ్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## రైతులను అన్ని విధాల ఆదుకుంటాం : ఎమ్మెల్యే



బాలాయపల్లి, డిసెంబర్ 13 ప్రభాతవార్త : తుఫాను ప్రభావం నష్టపోయిన రైతులను ఆదుకుంటావని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షాలకు బాలాయపల్లి మండలం మేల్చూరు చెరువుకు గండి పడడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు, అధికారులకు సమాచారం తెలపడంతో శాసన సభ్యులు రామకృష్ణ, తహసిల్దార్ పి శ్రీనివాసులు, ఎస్సై కామినేని గోపి, ఇరిగేషన్ డి ఈ సుధాకర్ రెడ్డి, ఏఈ జహిద్‌లు చెరువు గండిని, నీటమునిగిన పంటపొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతులను అన్ని విధాలు ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రైతులను ఆందోళన చెందవద్దని సూచించారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నేతలు నల్లబోతుల మురళి, నరసింహులు నాయుడు, శ్రీనివాసులు, రెవిన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కాజ్‌వేను పరిశీలిస్తున్న అధికారులు



వాకాడు, డిసెంబర్ 13, ప్రభాతవార్త : వాకాడు మండలం బాలిరెడ్డిపాలెంలోని శుక్రవారం స్వర్ణముఖి నదిలలో వరద నీరు ఉధృతం కావడంతో గంగను పాలెం కాజ్ వే ను అధికారులు పరిశీలించారు. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు స్వర్ణముఖి నదిలో 27 వేల క్యూసెక్ వరద ప్రవాహం వస్తుండడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు స్వర్ణముఖి నది బ్యారేజ్ 7 గేట్లు ఎత్తడంతో బాలిరెడ్డి పాలెం వద్దనున్న గంగన పాలెం గ్రామంలోకి వరద నీరు రాకుండా రహదారి లో అడ్డుకట్లు వేశారు, అడ్డుకట్లను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణ రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్, పోలీస్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు స్థానిక నేతలు ఉన్నారు.

## దుగ్గరాజపట్నంలో రెవెన్యూ సదస్సు



వాకాడు, డిసెంబర్ 13 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే రెవెన్యూ సదస్సు కార్యక్రమమును పెట్టడం జరిగిందని తాసిల్దార్ రామయ్య అన్నారు. శుక్రవారం వాకాడు మండలం దుగ్గరాజపట్నం గ్రామంలో సర్పంచ్ శ్రావణి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణ రావు, నాయకులు దోసకాయల కృష్ణమూర్తి, పూడి మహేంద్ర, రవి నాయుడు, రాము, రెవిన్ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్, మండల సర్వేయర్ శకుంతల వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## గూడూరు దర్గాలో భారీ అన్నదానం



గూడూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త : గూడూరులోని సాధుపేట సెంటర్‌లోని సయ్యద్ ఖాదర్ వల్లీ దర్గా కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించడం జరిగింది. దాదాపు 60 సంవత్సరాల నుండి ప్రతీ సంవత్సరం గంధమ హోత్సవం నిర్వహిస్తారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో 12వతేది గంధమ హోత్సవం నిర్వహించి, గంధంను సాధుపేట, జనార్దన్ రెడ్డి కాలనీ నందు ఊరేగించారు. కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సయ్యద్ ఖాదర్ వల్లీ దర్గాను పూలతో అలంకరణ చేసి, దాదాపు వెయ్యి మందికి భారీ అన్నదానం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో దర్గా కమిటీ నిర్వాహకులు ఎస్‌కె. మస్తాన్, మురళీధర్, ఎస్‌డి ఖాలేషా, ఎస్‌కె. సలీం, యజ్దాన్ భాయ్, లెమన్ ఖాలేషా, నజీర్, బిక్కు సాహెబ్ షబ్బీర్ భాయ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘాట్‌లో అక్కగార్లకు కార్తీకపూజలు



తిరుమల,డిసెంబర్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల నుండి తిరుపతికి దిగే మొదటి ఘాట్‌లో కొలువైన అక్కగార్లకు శుక్రవారం ఉదయం కార్తీకమాస పూజలు నిర్వహించారు. కనుమరహదారిలో ప్రమాదాలు జరగకుండా చూడాలని, భక్తులు సురక్షింతగా ప్రయాణించాలని వేడుకుంటూ ఏడుగురు అక్కగార్లకు టిటిడి రవాణా విభాగంచే ఈ ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

## 17నుండి గోదాతిరుప్పావై



తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి: ధనుర్మాసం ఈనెల 16వతేదీ నుండి ప్రారంభంకానుంది. ఆ రోజు ఉదయం 6.57గంటలకు ధనుర్మాసఘడియలు మొదలు కానున్న నేపథ్యంలో ఈనెల 17వతేదీ మంగళవారం నుండి వేకువజామున తిరుమల వేంకటేశ్వరునికి నిర్వహించే సుప్రభాతసేవ రద్దుచేశారు. ఆ సేవ స్థానంలో గోదాదేవి తిరుప్పావై ప్రవచనాలు నివేదిస్తారు. తిరుప్పావైతోనే నెలరోజులు తిరుమల ఆలయంలో ఆలయ అర్చకులు,పండితులు స్వామివారిని మేల్కొలుపుతారు. జనవరి14వతేదీ మంగళవారంతో ధనుర్మాసఘడియలు ముగుస్తాయి. బిల్వపత్రాలతో సహస్రనామార్చన చేస్తారు. శ్రీవిల్లిపుత్తూరు చిలుకలను ప్రతి రోజూ స్వామివారికి అలంకరిస్తారు. తిరుప్పావై పఠనం ఆలయంలో నెలరోజులు పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది.

## లోకా ఫౌండేషన్‌చే అన్నదాన కార్యక్రమం




వరదయ్యపాలెం, డిసెంబర్ 13 ప్రభాతవార్త : రెవిన్యూ అధికారుల విన్నపం మేరకు వెంటనే స్పందిం చిన లోక ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజి అనిల్‌పురం గిరిజన కాలనీ బి జి ఆర్ కాలనీ వాసులకు చిన్నపాండూరు నక్కల మెట్ట షికారులకు అన్నదానం తిరుపతి జిల్లా సత్యవేడు నియోజక వర్గం వరదయ్య పాలెం మండల అనిల్ పురం (బిజిఆర్‌ఎస్టి కాలనీ) కేంద్రంలోని రెక్కాడితే గాని డొక్కాడని దారిద్ర రేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాలు ప్రతిరోజు పనికి పోతే గాని కడుపు నిండని పరిస్థితి. అలాంటిది త్రుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా సరిగా పనులు లేక కూలీలకు పోలేక కడుపు కోతతో అల్లాడుతున్న అనిల్‌పురం బి.జి.ఆర్.కాలనీ వాసులకు నక్కల మెట్ట షకారులకు వరదయ్యపాలెం మండలం లోకా ఫౌండేషన్ ముందుకు వచ్చి భోజన సదుపాయం కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా స్థానికులు మాట్లాడుతూ గత రెండు రోజులుగా తుఫా న్ కారణంగా వరదయ్యపాలెం తాసిల్దార్ రాజశేఖర్ బాబు వారు రెవెన్యూ సిబ్బంది, వరదయ్యపాలెం ఎస్పై మల్లికార్జున్, వాళ్ల పోలీస్ సిబ్బంది, ఎక్కడ ఎలాంటి ఆహ్వానించి సంఘటనలు జరగకుండా ప్రతి నిమిత్తం రాత్రి పగలు తేడా లేకుండా సేవలు చేశారని వారికి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు అదేవిధంగా రెవెన్యూ సిబ్బందికి విన్నవించుకున్న మాకు తొందరగా ఇళ్ల స్థలాలు ఇప్పిచ్చి దగ్గరుండి ఇల్లు కట్టించవలసిందిగా కోరారు. కంచరపాలెం గిరిజన కుటుంబాలకు డిపి చాక్లెట్ పరిశ్రమ యాజమాన్యం భోజన సదుపాయం కల్పించింది. కంచరపాలెం మాజీ సర్పంచ్ మండల టిడిపి ప్రధాన కార్యదర్శి దశరధన్ విజ్ఞప్తి మేరకు డిపి చాక్లెట్ యాజమాన్యం కంచరపాలెం లోని 50 కుటుంబాలకు శుక్రవారం మధ్యాహ్నం భోజన ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమం లో వీఆర్వో మధు స్వామి. వీఆర్ఏ లు రాధయ్య, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సున్నపు కాలువ విజృంభణ...రాకపోకలు స్థంభన

-సువర్ణముఖి పరివాహాక ప్రాంతాల పరిస్థితి ఆగమ్యగోచరం


సున్నపు కాలువ వరదప్రవాహం


గ్రామంలోకి చేరిన అమ్మపాళెం గ్రామం



శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలాన్ని వాన ముంచెత్తింది.శ్రీకాళహస్తి మండలంలోని చెరువుల ప్రమాద స్థితికి చేరుకున్నాయి. కొన్ని చెరువులు తెగాయి. దాంతో సువర్ణముఖి నది విజృంభిస్తూ, నది పరివాహాక ప్రాంతాల్లో గ్రామాల్లో నీరు చుట్టుముట్టి ఇబ్బంది పెడుతుంది. గ్రామాలకు రాకపోకలు స్థంభించి, శుక్రవారం కూడా పరిస్తితి కుదుట పడలేదు. సువర్ణముఖి నదిలో 11వేల క్యూసెక్కులు నీరు సముద్రం పాలౌతుంది.శ్రీకాళహస్తి మండలంలోని అక్కుర్తి, ముచ్చివోలు పరిసరాలకు వెళ్ళటానికి పట్టణానికి సమీపంలోని 'సున్నపు కాలువ' శుక్రవారం కూడా శాంతించలేదు. దాంతో గ్రామాల్లో పరిస్థితి ఏమిటో అర్థం కాని పరిస్తితి చోటు చేసుకుంది. ఇక సువర్ణముఖి పరివాహాక ప్రాంతం అయిన అమ్మపాళెం, చుక్కల నిడిగల్లు గ్రామాల్లోకి నీరు ప్రవహించింది. ఆ గ్రామాలకు చెందిన జనం బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ నెల 16 నుంచి మళ్ళీ వర్షాలు కురుస్తాయనే ప్రకటనతో గ్రామాల్లో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. శ్రీకాళహస్తి మండలంలోని రామాపురం చెరువు మరో సారి తెగింది. చెరువులోకి వచ్చిన నీరు కళ్ళెదుటే సముద్రం పాలౌతుంటే గ్రామస్థులు దీనంగా చూస్తున్నారు. సమృద్ధిగా వర్షాలు కురియగా అనందం వ్యక్తం చేస్తున్నంతలోని చెరువులు తెగి నీరు వృధా అవుతుంటే రైతులకు కన్నీరే మిగిలింది.ఇక ఏర్పేడు మండలంలోని మోదుగులపాళెం,ముసలిపేడులకు రాకపోకలు స్థంభించాయి.ఇక ముసలిపేడు పాపానాయుడు పేట రోడ్లు చెరువు తెగటంతో రాకపోకలు స్థంభించాయి. ముసలిపేడు గ్రామం జలదిగ్భంధంలో మునిగింది.

## ఆరనీకుమా...ఈ దీపం కార్తీకదీపం

-కపిలతీర్థం కొండపై వేడుకగా కొండదీపం



తిరుపతి(రవాణా),డిసెంబర్ 13ప్రభాతవార్త: కార్తీకమాస దీపోత్సవం శుక్రవారం సాయంత్రం తిరుపతి లోని కపిలతీర్థం ఆలయం కొండపై దేదీప్యమానంగా వెలిగించారు. ప్రతి ఏటా కార్తీకమాసంలో పౌర్ణమిఘడియలకు ముందు కృత్తికా నక్షత్రాన శైవ ఆలయం కపిలతీర్థం కొండపై కొండదీపం ఆలయ అర్చకులు అత్యంత భక్తితో వెలిగిస్తారు. ఈ దీపం మూడురోజులు అలాగే వెలుగుతూనే ఉంటుంది. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై హరహరమహాదేవ శంభోశంకర నినాదంతో మారుమోగింది. భక్తులు కూడా పవిత్ర పుష్కరిణిలో దీపాలు వెలిగించి కపిలేశ్వరస్వామిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఈఓ గౌతమి, విఎస్ఓ సదాలక్ష్మి, ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, భక్తులు, అర్చకఉలు పాల్గొన్నారు.